


షాడోలను తప్పించండి

- అందుబాటులో ఉండి ప్రజావసరాలను గుర్తించండి
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ప్రతి శాసనసభ్యుడు, ఇన్‌చార్జితో ముఖాముఖి
- నివేదికలు ముందుంచుకుని కొందరికి చురకలు

'నియోజకవర్గాల్లో మీ తరఫున మేమున్నామని పెత్తనం చేస్తూ ప్రజల దృష్టిలో షాడోలుగా ముద్రపడిన వారిని తక్షణం తప్పించండి. మీరే అందుబాటులో ఉండండి. ప్రజలతో వినయంగా మెలగండి. అభివృద్ధి పనులతోపాటు ప్రజలు, కేడర్ అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులకు సూటిగా చెప్పేశారు. నియోజకవర్గాల వారీ తాను సేకరించుకున్న సమాచారాన్ని ముందు పెట్టుకొని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో ముఖాముఖి మాట్లాడారు. వారికి నిర్మొహమాటంగా హెచ్చరికలు చేశారు. అందిన సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలోని సుమారు ఎనిమిది మంది నేతలతో ఇప్పటికే ఆయన సమీక్ష నిర్వహించారు. ఇద్దరు మంత్రులు మినహా మరో ఇద్దరు ఎమ్మెల్యేలతో నేడో, రేపో భేటీ కానున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన తరువాత సీఎం చంద్రబాబునాయుడు ఉమ్మడి జిల్లాలోని పార్టీ శాసనసభ్యులు, ఇన్‌చార్జిలను విడివిడిగా పిలిపించుకొని వారి పనితీరు, ఆయా నియోజకవర్గాల్లోని పరిస్థితులపై విపులంగా సమీక్షిస్తున్నారు.

షాడోలపై సీరియస్

తొలుత పశ్చిమ ప్రాంతంలోని ఇద్దరు ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అయిన చంద్రబాబు.. మీ నియోజకవర్గాల్లో కుటుంబసభ్యుల పాత్ర పెరగడం కరెక్టు కాదని సూటిగా చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత ఒక ఇన్‌చార్జితో మీ దంపతులు సరే.. నియోజకవర్గంలో మీ బంధువు జోక్యం శ్రుతిమించిందంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ తర్వాత జిల్లా కేంద్రానికి సంబంధం ఉన్న రెండు నియోజక వర్గాలు, ఉమ్మడి జిల్లాలోని దక్షిణ ప్రాంతంలో వేరే జిల్లాలో ఉన్న ఒక నియోజకవర్గ ఎమ్మెల్యేతో కూడా షాడోల పాత్రను ప్రస్తావించిన చంద్రబాబు కొన్ని సూచనలు చేసినట్లు తెలిసింది. దక్షిణ ప్రాంతంలో తొలిసారి ఎమ్మెల్యే అయిన ఒకరితో 'ప్రతి విషయంలోనూ ఆ ఇద్దరి జోక్యం ఏమిటి? వారిని కట్టడి చేయండి' అని సీరియస్‌గా చెప్పినట్లు సమాచారం. ఒంగోలు సమీప నియోజక వర్గ ఎమ్మెల్యేకు చాలాకాలంగా తనతో కలిసి నడుస్తున్న ఒక వ్యక్తి పేరును చెప్పి అతని పెత్తనాన్ని నివారించండి అని ఆదేశించినట్లు తెలిసింది. ఇంకో సీనియర్ ఎమ్మెల్యేకు బంధువులు, వ్యక్తిగత సహాయకుల జోక్యం ఉండకూడదని సూచించినట్లు తెలిసింది.

ప్రజల అవసరాలను తెలుసుకోండి

నియోజకవర్గాలవారీ స్థానికంగా ప్రజల అవసరాలకు సంబంధించి సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేలకు ప్రత్యేకమైన సమాచారం అందించి అందుకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించినట్లు తెలిసింది. 'చివరి దాకా చూడం. వచ్చే సమీక్ష నాటికి మీరు మారాలి. లేకపోతే భవిష్యత్తు అవసరాలపై పార్టీ నిర్ణయం మార్చుకుంటుంది' అని హెచ్చరించినట్లు తెలిసింది. సమీక్షల అనంతరం సూచనలు, హెచ్చరికలకు అనుగుణంగా అత్యధిక మంది ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు నియోజకవర్గాల్లో పలు చేర్పులు, మార్పులకు శ్రీకారం పలకడం విశేషం.

కొందరికి చురకలు

- ఒక ఎమ్మెల్యేను ఉద్దేశించి మీరు నియోజకవర్గంలో ఎన్నిరోజులు ఉన్నారో, బయట ఎన్నిరోజులు ఉన్నారో అన్నీ తెలుసు అంటూ ఆయన ఎన్ని గంటలు స్థానికంగా ఉన్నారన్నది తెలియజేసినట్లు సమాచారం.
- పశ్చిమప్రాంతంలోని రెండు, మూడు నియోజకవర్గాలకు సంబంధించిన బాధ్యులను ఉద్దేశించి 'రాజకీయంగా పెత్తనం చేసే ఒక సామాజికవర్గానికి చెందిన వైసీపీ నాయకులను మీరు చేరదీస్తున్నారు. వారు చివరి వరకు మనతోనే ఉంటారా... లేదా? అనే విషయాలను ఆలోచించండి. మన పార్టీలో ఉండి గత ఐదేళ్లు కష్టపడిన వారిని ఈ విషయంలో సమన్వయం చేసుకోండి' అని సూచించినట్లు సమాచారం.
- పశ్చిమ ప్రాంతంలోని ఒక ఇన్‌చార్జిను ఉద్దేశించి 'ముందు మీరు మాట తీరు మార్చుకోండి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే సూక్తిని మరచిపోవద్దు' అని హెచ్చరించినట్లు తెలిసింది. తీరప్రాంతంలో ఒక ఎమ్మెల్యేతో మీ కుమారులు, కుటుంబ సభ్యులు మంచివారే కానీ ఎమ్మెల్యే అనే విషయాన్ని గుర్తించి పాలనా వ్యవహారాల్లో జోక్యాన్ని నివారించుకోండి' అని సూటిగా చెప్పినట్లుగా తెలిసింది.



శ్రీకృష్ణుడిగా చెన్నుడు

మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణుడి అలంకరణలో రుక్మిణి, సత్యభామ సమేతుడై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు.

ఆంధ్రజ్యోతి, మార్కాపురం వన్‌టౌన్

పీ4కు మార్గదర్శకులు ఏరీ?

- జిల్లాలో 74,911 బంగారు కుటుంబాల గుర్తింపు
- మార్గదర్శకుల కోసం యంత్రాంగం కసరత్తు
- ఇప్పటి వరకు 44,607 కుటుంబాలకు తోడ్పాటు ఇచ్చేందుకు 7,073 మంది ఆసక్తి
- మిగిలిన 30,304 ఫ్యామిలీలకు అండగా నిలిచేవారు కరువు
- ముందుకు రాని ప్రజాప్రతినిధులు, నాయకులు
- సమీపిస్తున్న కార్యక్రమ అమలు సమయం

ఒంగోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం (పీ4) కార్యక్రమ అమలుకు సమయం సమీపిస్తున్నా అందులో కీలకమైన మార్గదర్శకుల గుర్తింపు కొలిక్కి రాలేదు. వారి ఎంపికకు ఈనెల 15తో గడువు ముగిసింది. అయితే ఇప్పటి వరకు 59.55శాతం కుటుంబాలకు తోడ్పాటు ఇచ్చేందుకు మార్గదర్శకుల గుర్తింపు పూర్తయింది. ఇంకా 40.45శాతం కుటుంబాలకు ఆసరా ఇచ్చే వారు దొరకలేదు. పేదరికంలో ఉన్నట్లు గుర్తించిన కుటుంబాలకు బంగారు కుటుంబాలుగా, వారికి తోడ్పాటునిచ్చే వారికి మార్గదర్శకులుగా పేరు పెట్టారు. మార్గదర్శకుల కోసం దాదాపు రెండు మాసాలుగా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇంకా 40శాతం కుటుంబాలకు అండగా నిలిచే వారు దొరకని పరిస్థితి కనిపిస్తోంది.

అధికారుల ప్రత్యేక సమావేశాలు

జిల్లాలో తొలుత నిర్వహించిన సర్వే ఆధారంగా 74,911 బంగారు కుటుంబాలను గుర్తించారు. మార్గదర్శకుల కోసం వివిధ వర్గాల వారితో ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. వివిధ స్థాయిల్లోని ఉద్యోగులు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. తొలుత ఒత్తిడి కూడా తీసుకు వచ్చారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గుర్తించిన ప్రభుత్వం ఇదంతా స్వచ్ఛందమే అని ప్రకటించడంతో ప్రస్తుతం ఆ ఒత్తిడి తగ్గింది. కాగా ఈనెల 15 నాటికి మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేసి 19 నుంచి కార్యక్రమాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గడువు ముగిసినా జిల్లాలో అవసరానికి సరిపడా మార్గదర్శకులు దొరకని పరిస్థితి నెలకొంది.

పూర్తిస్థాయిలో కొలిక్కిరాని కసరత్తు

జిల్లాలో గుర్తించిన 74,911 బంగారు కుటుంబాలలో కేవలం 44,607 కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు 7,073 మంది సమోదయ్యారు. ఇంకా 30,304 కుటుంబాలకు మార్గదర్శకుల అవసరం ఉంది. కనీసం ఐదువేల మంది అయినా దొరికితేనే ఆ కుటుంబాలకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. వారి గుర్తింపు కోసం అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొలిక్కి రాలేదు. కీలక ప్రజాప్రతినిధులు, అధికారం అండగా హల్‌చల్ చేసే నాయకులు ఎవరూ మార్గదర్శకుల్లో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం కార్యక్రమాన్ని 19నుంచి అమలు చేస్తే ఇప్పటి వరకు గుర్తించిన మార్గదర్శకుల ద్వారా తొలుత చేపట్టి అనంతరం మిగిలిన వారిపై దృష్టి సారించే యోచనలో అధికారులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

సంతనూతలపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ జిల్లాలో మరో రైతు ఉసురు తీసింది. సంతనూతలపాడుకు చెందిన కామినేని హరి (42) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సాగుకు పెట్టుబడి కోసం హరి గతేడాది సంతనూతలపాడులోని రెండు ప్రైవేట్ బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. ఆ సొమ్ముతో పొగాకు నారు దొడ్డిపెట్టి నష్టపోయారు. పొగాకు సాగులోనూ నష్టాలే మిగిలాయి. బ్యాంకులో పెట్టిన బంగారం వేలానికి రావడంతో హరి భార్య సౌజన్య తల్లిదండ్రులు కొంత ఆర్థిక సాయం చేశారు. మిగిలిన అప్పులు తీర్చే మార్గం కనిపించక కొద్దిరోజులుగా హరి తీవ్ర మనోవేదనలో ఉన్నారు. శనివారం మధ్యాహ్నం కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు. అన్ని జాగ్రత్తలు చెప్పి పనిమీద బయటకు వెళ్తున్నానని మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి నుంచి బయల్దేరారు. రాత్రికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వెతకడం ప్రారంభించారు. పి.గుడిపాడు సమీపంలోని పాలఫ్యాక్టరీ వద్ద వేపచెట్టుకు ఉరివేసుకుని వేలాడుతుండగా ఆదివారం గుర్తించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై వి.అజయ్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాఫీగా పోదాం!

- స్త్రీ శక్తి పథకానికి విశేష స్పందన
- మూడ్రోజుల్లో 40 నుంచి 90 శాతానికి పెరిగిన మహిళా ప్రయాణికులు
- క్రీడా పోటీలకు వెళ్లే విద్యార్థినులకు మరింత మేలు
- కిటకిటలాడుతున్న బస్టాండ్లు.. రద్దీగా కనిపిస్తున్న ఆర్టీసీ బస్సులు



మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకానికి విశేష ఆదరణ లభిస్తోంది. 15న స్త్రీ శక్తి పేరుతో అమల్లోకి వచ్చిన ఈ పథకం అతివల్లో ఆనందాన్ని నింపుతోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లే అవకాశం కల్పించడంతో నారీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా.. ఆధార్ వెంట ఉంటే చాలు పుట్టింటికి.. పుణ్యక్షేత్రాలకు, పాఠశాలలకు, ప్రభుత్వ ఉద్యోగాలకు, పెళ్లిళ్లకు నిర్భయంగా ఆర్టీసీలో సాఫీగా ప్రయాణిస్తున్నారు. ఇన్నాళ్లు ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య 40 శాతం మాత్రమే ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 90 శాతానికి పెరిగింది. బస్సులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. డిపోలు, బస్టాండ్‌లు రద్దీగా కనిపిస్తున్నాయి.

- ఒంగోలు కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి

అన్ని వర్గాలకూ మేలు

స్త్రీ శక్తి పథకం గృహిణులు,ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతోపాటు విద్యార్థినులకూ ఎంతో మేలు చేకూరుస్తోంది. క్రీడల్లో పురుషులతోపాటు విద్యార్థినులు, మహిళలు, వారి వెంట మహిళా కోచ్‌లు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొంటుంటారు. ఇన్నాళ్లు ఇతర ప్రాంతాల్లో అంతర్ జిల్లాలు, రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకావాల్సి వచ్చినప్పుడు వారికి రవాణా చార్జీలు భారంగా ఉండేవి. ఇప్పుడు ఉచిత ప్రయాణంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

ఆధార్ లేకున్నా వారంపాటు అవకాశం

ఆర్టీసీలో ప్రయాణించే మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఓటర్, ఆధార్, రేషన్ కార్డుల్లో ఏదైనా చూపించి ప్రయాణించవచ్చని ప్రభుత్వం తెలియజేసింది. కొంతమంది మహిళలు ఆధార్ కార్డు మర్చిపోతుండటంతో వారం రోజులపాటు అవి లేకపోయినా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఎండీ ఆదేశించారు.

57 వేల మందికి రూ.25 లక్షలు ఆదా

కొండపి, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం వరకు 57వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని, వారికి రూ.25 లక్షలు ఆదా అయ్యాయని ఆర్ఎం సత్యన్నారాయణ చెప్పారు. ఆదివారం కొండపిలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆదివారం సందర్శించి పలు బస్సులను తనిఖీ చేశారు. మహిళా ప్రయాణికులతో ఆయన మాట్లాడారు.


మెగా డీఎస్సీపై మరో ముందడుగు

- టీచర్ పోస్టుల ఖాళీలపై ఆరా
- 3,4 కేటగిరీ స్కూళ్లకు కొత్త ఉపాధ్యాయులు
- నేడు మంగళగిరిలో సమావేశం

ఒంగోలు విద్యఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 ఫలితాలను ప్రకటించిన పాఠశాల విద్యాశాఖ ప్రస్తుతం నియామకాలపై దృష్టి సారించింది. ఈనెలాఖరు లోపు ప్రక్రియను పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టింది జిల్లాలోని ఖాళీ టీచర్ పోస్టులపై ఆరా తీసింది. డీఎస్సీ టీచర్ల నియామకంలో పాటించాల్సిన మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రధానంగా 3,4 కేటగిరీల్లోని పాఠశాలల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

ప్రాధాన్యతలివీ..

మెగా డీఎస్సీ టీచర్ల నియామకాలకు 3,4 కేటగిరీల్లోని పాఠశాలల్లో ఖాళీ పోస్టులను గుర్తించనున్నారు. మొదటి ప్రాధాన్యతగా ఇతర స్కూళ్లకు బదిలీ అయి రిలీవర్‌రాని కారణంగా అక్కడే పనిచేస్తున్న వారిని రిలీవ్ చేసేందుకు ఆ పాఠశాలలో ఖాళీలు చూపిస్తారు. 50శాతం టీచర్లు కేటాయించబడని పాఠశాలల ఖాళీలను ప్రకటిస్తారు. ఈ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని డీఎస్సీ టీచర్లకు ఖాళీ జాబితాలను సిద్ధం చేయాలని ఆర్‌జేడీలు, డీఈవోలను ఉన్నతాధికారులు ఆదేశించారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శనం చేసేందుకు సోమవారం మంగళగిరిలోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నారు.



తగ్గనున్న బ్యారన్‌ల కొనుగోళ్లు, లీజులు

ప్రస్తుత సీజన్‌లో ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్ రీజియన్ల పరిధిలో 30,109 మంది రైతులు పంట సాగుకు నమోదు చేసుకోగా 24,575 బ్యారన్లకు లైసెన్సులు పునరుద్ధరించుకున్నారు. వారంతా వచ్చే సీజన్ సాగుకు తిరిగి రిజిస్ట్రేషన్లు, బ్యారెన్ లైసెన్స్‌లు రెన్యువల్ చేయించుకోవాలి. ఇకపై మూడేళ్లకు ఒకేసారి చేస్తారు. లైసెన్సు ఉన్న రైతు మరణిస్తే వారి వారసులకు మాత్రమే ఈ మూడేళ్లలో రెన్యువల్‌కు అవకాశం ఇస్తారు. కొత్త బ్యారన్ల కొనుగోలు జరిగితే ఈ ఏడాది కొన్న వారి పేరుపై లైసెన్స్ మారుస్తారు. తదుపరి రెండేళ్ల అవకాశం ఉండదు. లీజు బ్యారన్ల విషయంలోనూ మూడేళ్ల నిబంధన వర్తిస్తుంది. లైసెన్సుల పునరుద్ధరణను అక్టోబరు 22 వరకు నిర్ణీత ఫీజుతో చేస్తారు. రూ.100 ఆలస్య రుసుంతో నవంబరు 11 వరకు, రూ.400 రుసుంతో నవంబరు 19 వరకు అనుమతి ఇస్తారు.

ఇకనుంచి మూడేళ్లు!

- నేటి నుంచి వచ్చే సీజన్ పొగాకు సాగుదారుల రిజిస్ట్రేషన్
- బ్యారన్ లెసెన్సులూ పునరుద్ధరణ
- దక్షిణాదిలో 30,109 మంది రైతులకు 24,575 బ్యారన్లు
- అపరాధ రుసుంతో నవంబరు 19 వరకు గడువు
- వచ్చే సీజన్‌కు 90.20 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి

ఒంగోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ఉత్పత్తి ప్రక్రియలో అత్యంత కీలకమైన పంట సాగు రిజిస్ట్రేషన్, బ్యారన్ లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఇప్పటి వరకు ఏటా ఇది జరుగుతుండగా ఇక నుంచి మూడేళ్లకు ఒకసారి చేయనున్నారు. ఆ మేరకు పొగాకు బోర్డు మార్గదర్శకాలను మార్చారు. రాష్ట్రంలో వచ్చే సీజన్ (2025-26)కు రాష్ట్రంలో 142 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అందులో దక్షిణాదిలోని ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్ రీజియన్ల పరిధిలో ఉన్న 11 వేలం కేంద్రాల్లో 90.20 మిలియన్ కిలోలు ఉంది. ప్రస్తుతం విక్రయాలు జరుగుతున్న సీజన్‌కు భారీగా పంట ఉత్పత్తి జరగ్గా మార్కెట్లో తీవ్ర ప్రతికూల పరిస్థితి కనిపిస్తోంది. ధరలు సరిలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో వచ్చే సీజన్(2025-26)కు పంట ఉత్పత్తి పరిమాణాన్ని తగ్గించడంతోపాటు రిజిస్ట్రేషన్లు, లైసెన్సుల పునరుద్ధరణకు సంబంధించి పలు నిబంధనలను కఠినతరం చేస్తూ ఇటీవల పొగాకు బోర్డు ఉన్నతాధికారులు నూతన మార్గదర్శకాలను జారీచేశారు.



ఉత్సాహంగా యోగా పోటీలు

ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో ఆదివారం జిల్లాస్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పెద్దసంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొని యోగాలో తమ ప్రతిభను చాటారు. పలువురు వేసిన ఆసనాలు అబ్బురపరిచాయి.





ఒమ్మెవరంలో ఓ ఇంటిపై ప్రమాదకరంగా అనుకుని ఉన్న కరెంటు తీగలు



ఒమ్మెవరం కోదండరామస్వామి చెరువు వద్ద నేలకొరిగిన 11 కేవీ స్తంభం

ప్రమాదం పొంచివున్నా..

అలవిమాలిన నిర్లక్ష్యం..!

నాగులుప్పలపాడులోని బొడ్డురాయి వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న స్థానికుడు

పలు గ్రామాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

నేలకొరుగుతున్న కరెంటు స్తంభాలు ● పట్టించుకోని విద్యుత్‌శాఖ సిబ్బంది

భయాందోళనలో ప్రజలు



నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె



ఉప్పుగుండూరులోని నాగన్నవాగు వద్ద పడిపోతున్న కరెంటు స్తంభానికి ప్రత్యేకంగా తీగ కట్టిన విద్యుత్ సిబ్బంది

నాగులుప్పలపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికందేంత ఎత్తులో కిందికి వేలాడుతున్నాయి. 11 కేవీ విద్యుత్ స్తంభాలు నేలచూపులు చూస్తూ ఎప్పుడు పడిపోతాయో అర్థం కాని పరిస్థితి. ఇక ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు పగిలిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా సమస్యలు పరిష్కరానికి నోచుకోక ప్రజలు భయాందోళనతో గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

నాగులుప్పలపాడులోని బొడ్డురాయి సెంటర్ వద్ద తూర్పు బజారులో విద్యుత్‌తీగలు కిందగా వేలాడుతున్నాయి. వ్యవసాయ, ఇతర పనులకు ట్రాక్టర్లు, వాహనాలలో ఆటుగా వెళ్లాలంటేనే జనం హడలెత్తుతున్నారు. ఇంకొల్లు రోడ్డులోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సిమెంట్ దిమ్మె పగిలిపోయి ఎప్పుడు కూలుతుందో అర్థం కాని పరిస్థితి. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పగిలిపోయిన దిమ్మె స్థానంలో కొత్త కాంక్రీట్ స్తంభం దిమ్మెను రెండు నెలల కిందట తీసుకొచ్చి అక్కడే పడేశారు. కానీ దానిని ఏర్పాటు చేయడంలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక ఒమ్మెవరం గ్రామంలో ఎక్కడ చూసినా విద్యుత్ తీగలు కిందికి వంగిపోయి చేతికందేంత ఎత్తులో ఉన్నాయి.

పలుమార్లు విద్యుత్‌శాఖ ఏఈ రమేష్, సిబ్బందికి మొరపెట్టుకొన్నా స్పందించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోదండరామయ్య చెరువు వద్ద 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభం పూర్తిగా ఒకవైపు ఒరిగిపోయి నేల చూపులు చూస్తుంది. ఎప్పుడు కింద పడుతుందోనని రైతులు, కూలీలు భయాందోళనకు గురవుతున్నారు. ఉప్పుగుండూరులోని మాచవరం రోడ్డులోని నాగన్నవాగు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు ఓ పక్కకు ఒరిగిపోయి దర్శనమిస్తున్నాయి. అయితే అక్కడ స్తంభాన్ని మరింత ఒరిగిపోకుండా ఉండేలా పక్కనే ఉన్న మరో స్తంభానికి స్టే తీగతో కట్టారు. విద్యుత్‌సిబ్బంది ఏ పని చేయాలన్నా చేయి తడిపితేనే కానీ పనులు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పంపిణీకి సిద్ధంగా పట్టాదారు పుస్తకాలు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలంలోని మూడు గ్రామాలకు సంబంధించి 1,579 పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఒంగోలు రూరల్ తహసీలార్ నాయబ్‌రసూల్ ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. చేజర్ల గ్రామానికి 665, మంగళాద్రిపురంనకు 339, సర్వేరెడ్డిపాలెంకు 575 పట్టాదారు పాసుపుస్తకాలు ప్రభుత్వం నుంచి వచ్చాయన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదెను పరిశీలిస్తున్న స్థానికులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ట్రాలీ వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందిన సంఘటన ఉప్పుగుండూరు వద్ద జాతీయ రహదారిపై జరిగింది. చినగంజాం మండలం పెదగంజాం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ట్రాలీ వాహనంలో ఆదివారం కామేపల్లి దేవాలయానికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళుతున్నారు. ఈక్రమంలో ఉప్పుగుండూరు గ్రామంలోని నాగన్న వాగు వద్దకు వాహనం రాగానే ఎదురుగా వస్తున్న గేదెలను ఢీకొంది. దాంతో ఒక గేదె ఎగిరి రోడ్డు పక్కన పడగా, మరో గేదె ట్రాలీ వాహనం టైర్ల కింద పడి మృతి చెందాయి.

ఏకలవ్య విగ్రహ నిర్మాణ కమిటీ ఎన్నిక

నాగులుప్పలపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని ఏకలవ్య కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఏకలవ్య విగ్రహ నిర్మాణానికి ఆదివారం కమిటీ ఏర్పాటు చేశారు. ఏకలవ్య సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు స్థానిక కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో విగ్రహ నిర్మాణ ఏర్పాటుపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజేతోనే జర్నలిస్టుల హక్కుల సాధన

● యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు



భోజనం వడ్డిస్తున్న ఐవీ.సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర ఏపీయూడబ్ల్యూజేకే దక్కిందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) 69వ వార్షికోత్సవం యూనియన్ జిల్లా శాఖ, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని పవర్ ఆఫీసు ఎదురు రోడ్డులో ఉన్న అంధుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఐవీసుబ్బారావు మాట్లాడారు. రాష్ట్రంలో పదివేలకు పైగా జర్నలిస్టులు ఉన్నారని, వారందరి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం అంధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి దాసరి కనకయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్ శిల్పసౌందర్యకు సన్మానం

మద్దిపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ అవార్డు పొందిన ఏడుగుండ్లపాడు సర్పంచ్ దాసరి శిల్పసౌందర్యను ఆదివారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పెదకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు మండవ హరిప్రసాద్, దాసరి రమేష్‌బాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి తదితరులు సర్పంచ్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ఢిల్లీ స్థాయిలో శిల్పసౌందర్య అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అజయ్‌కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

తాళ్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఈఘటన ఆదివారం ఉదయం మండలంలోని తూర్పుగంగవరంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోనుగుంట చినవెంకటసుబ్బారావు(74) పొలానికి మోటార్‌సైకిల్‌పై శివరాంపురం వెళ్లే పొలంబాట మార్గంలో వెళుతున్నాడు. అదేసమయంలో శివరాంపురం నుంచి తూర్పుగంగవరంనకు మరో వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో పోలేరమ్మ గుడి సమీపాన ఎదురెదురుగా మోటార్‌సైకిళ్లు ఢీకొన్నాయి. దీంతో బాబూరావు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వాహనచోదకుడికి స్వల్పగాయాలయ్యాయి.

పాముకాటుకు రైతు మృత్యువాత

ముండ్లమూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపాలెంకు చెందిన మానం శ్రీనివాసరావు(50) అనే రైతు ఆదివారం పాము కాటుకు గురై మృతిచెందాడు. తాను సాగుచేస్తున్న మొక్కజొన్న పైరుకు నీరు పెట్టేందుకు మధ్యాహ్నం పొలానికి వెళ్ళాడు. తనకు విషసర్పం కాటువేయడంతో వెంటనే సమీపంలో ఉన్న తన కుమారుడికి తెలిపారు. వెంటనే అతను బంధువులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఇంటికి తీసుకెళ్లేలోపే శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుబ్బాయమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఎన్.వెంకటేశ్వరరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



విజయ్‌కుమార్

దర్శి ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారాసిట్టింగ్ వాలీబాల్ వరల్డ్‌కప్ పోటీలకు దర్శి పట్టణానికి చెందిన వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. అక్టోబరు 8 నుంచి 18వ తేదీ వరకు అమెరికాలో జరిగే పారాసిట్టింగ్ వాలీబాల్ వరల్డ్‌కప్ పోటీల్లో భారతదేశం తరుపున ఆడే అవకాశం విజయ్‌కుమార్‌కు లభించింది. 2023లో ఆసియన్ జోన్ పారాసిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో కూడా ఆయన పోటీల్లో పాల్గొన్నారు. రెండోసారి దేశం తరుపున ఆడే అవకాశం రావటం పట్ల విజయ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. అవకాశం కల్పించిన వాలీబాల్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జేసీ గోపాలకృష్ణ చేతులమీదుగా మెరిట్‌పత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు

పీసీపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యోగా పోటీలకు మండలంలోని వెంగళాయపల్లి పాఠశాలకు చెందిన సీహెచ్.జశ్వంత్, సీహెచ్ మానస, పి.శివపార్వతి ఎంపికయ్యారు. ఆదివారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి యోగాపోటీల్లో వెంగళాయపల్లి, నేరేడుపల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14, 15 వయస్సు విభాగం హ్యాండ్ బ్యాలెన్స్ సుపైన్ ఆసనాస్ ఈవెంట్‌లో ప్రథమ స్థానాలు సాధించి మెడల్స్ పొందారు. అలాగే నేరేడుపల్లికి చెందిన స్వర్ణ రేవంత్‌సాయి, స్వర్ణ వెంకటసాయి యశశ్వినీలు అదే విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వెంగళాయపల్లి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య హ్యాండ్ బ్యాలెన్స్, సుపైన్ ఆసనాస్‌లో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులు జేసీ గోపాలకృష్ణ చేతులమీదుగా మెరిట్‌పత్రాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని విద్యాశాఖ అధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, విద్యాకమిటి ఛైర్మన్ చెన్నుపాటి వీరాంజనేయులు అభినందించారు.

వెలిగొండకు నిధులు కేటాయించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2000 కోట్లు కేటాయించాలని సీపీఐ నాయకుడు అందె నాసరయ్య అన్నారు. మార్కాపురం పూలసుబ్బయ్య భవన్‌లో ఈనెల 23న ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో షేక్ ఖాసిం, కృష్ణారావు, శేఖర్, కాశయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఎమ్మెల్యే బీఎన్ ప్రత్యేక పూజలు ● పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

మద్దిపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం నందిపాడు దళితవాడలో నూతనంగా నిర్మించిన శ్రీప్రసన్నఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా వేదపండితులు గత మూడు రోజులు నుంచి ప్రత్యేక హోమాలు, పూజలు సాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, దుగ్గినేని నరసింహారావు, పోతినేని శ్రీనివాసరావు, రాయపాటి శ్రీనివాసరావు, చిన్నబ్బాయి, మేడికొండ శ్రీనివాసరావు, కొర్రపాటి మాధవరావు, గడ్డం రవి, మండవ ప్రతాప్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివాకరపల్లిలో నిర్మిస్తున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించారు. ప్లాంట్‌ను సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్లాంట్‌ను త్వరగా నిర్మిస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అలాగే కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఉపాధి కోసం వలస పోకుండా ఇక్కడే పని దొరుకుతుందని చెప్పారు. ప్లాంట్ కోసం గడ్డి పెంచేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అందుకోసం తీసుకొచ్చిన నూతన ట్రాక్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

విద్యార్థిని మృతికి సంతాపం



కరుణ మృతదేహం వద్ద ప్రిన్సిపాల్ మేరిమంజుల

రాచర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాచర్ల బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ అనారోగ్యానికి గురై విద్యార్థిని కరుణ మృతిపై ప్రిన్సిపాల్ మేరీ మంజుల సంతాపం వ్యక్తం చేశారు. కరుణ అనారోగ్యంతో కంభం ప్రభుత్వ వైద్యశాలలో శనివారం చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ప్రిన్సిపాల్ శనివారం రాత్రి బాలిక స్వగ్రామం వెలగలపాయకు వెళ్లి కరుణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలిక జ్వరానికి గురైందని, వెంటనే వైద్యశాలలో చికిత్సనందించి మందులు వేయడంతో తగ్గిందన్నారు. అయితే తాను ఇంటికి వెళ్లిన తరువాత కరుణ మృతి చెందినట్లు తెలియడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెతోపాటు పాఠశాల హౌస్ టీచర్ విజయలక్ష్మి, నర్స్ సత్యసుధ ఉన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్యపరీక్షలు

బాలికలు ఆరోగ్యంపట్ల జాగ్రత్తగా ఉండాలని అనుములవీడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రమేష్ అన్నారు. రాచర్ల బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం తమ సిబ్బందితో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేయగా ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వైద్య సేవలందించారు. ఇబ్బంది కలిగించే వ్యాధులు ఎవరికీ లేవని, చెందాల్సిన అవసరం లేదని రమేష్ తెలిపారు.

రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి

● మంత్రి స్వామి



కామయ్యకు ప్రమాణ స్వీకారపత్రాన్ని అందజేస్తున్న మంత్రి స్వామి, మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య

టంగుటూరు (కొండపి), ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని కొణిజేడు పీఏసీఎస్ అధ్యక్షుడు రామా కామయ్య, ఇద్దరు సభ్యులు గుమ్మా శ్రీను, పొనుగుపాటి శ్రీను ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏపీ మారిటైంబోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యతో కలిసి పాల్గొన్నారు. కొణిజేడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో స్వామి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పెట్టుబడి నిధులు, రాయితీతో యాంత్రీకరణ పరికరాలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కొణిజేడు గ్రామం రైతు వారీగా అభివృద్ధి పథంలో ఉందన్నారు. గ్రామాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొణిజేడు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు రామా కామయ్యకు ఎంపిక పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రామా గోపి, సాగునీటి సంఘం ఛైర్మన్ రామా సీతారామయ్య, కొణిజేడు టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి కల్యాణ్, ఎంపీపీ స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ ఎనమల వెంకటరావు, ఎస్ఎస్‌పీ ఇరిగేషన్ డీసీ కమిటీ అధ్యక్షుడు రామశ్రీను, గ్రామ నాయకులు దామచర్ల బసవయ్య, దామచర్ల శ్రీను, ఎస్సీసెల్ అధ్యక్షుడు బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

● ఎస్పీ దామోదర్



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

మద్దిపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పోలీసులు అలసత్వం వీడి పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశించారు. ఆదివారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న రికార్డులను, డ్యూటీల కేటాయింపు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. మిస్సింగ్ కేసులు, పెండింగ్ కేసుల విచారణ త్వరతగతిన పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల పరిష్కారంలో జాప్యం జరిగితే బాధితులకు సత్వర న్యాయం చేయలేమన్నారు. నేరాల కట్టడికి గస్తీ ముమ్మరం చేయాలని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబరు 112 నుంచి ఫిర్యాదులు రాగానే పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే కళాశాల, పాఠశాల విద్యార్థినులకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ బి.శివరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. లోపించిన పారిశుధ్యం..!

● ఇబ్బందిపడుతున్న ప్రజలు



మంగమూరులోని ఓ వీధిలో చెత్తాచెదారంతో నిండిన మురుగు కాలువ

సంతనూతలపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతనూతలపాడు, మంగమూరులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తోంది. మురుగు కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఏర్పడింది. పారిశుధ్యం మెరుగుకు సరైన చర్యలు చేపట్టకపోవడంతో దోమలు ఎక్కువై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే కొందరు అనారోగ్యంతో ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఈ సందర్భంగా మంగమూరుకు చెందిన అబ్బూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ గ్రామంలోని కాలువల్లో చెత్త పేరుకుపోయిందని, దీంతో దోమలు ఎక్కువై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఆరోపించారు. కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యంపై గ్రామాల్లో దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



స్వామివారికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కందుల

భక్తిశ్రద్ధలతో రంగనాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామంలో భూదేవి శ్రీదేవి సమేత రంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా జరిగిన ప్రతిష్ఠోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, అన్నా రాంబాబు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, యువకులు, మహిళలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.



ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

పరవళ్లు


ఒంగోలు బ్రాంచ్ కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

ప్రస్తుతం కాలువల్లో నీటి పంపిణీ వివరాలు

అధికారుల లెక్కల ప్రకారం ఆదివారం సాగర్ కుడి కాలువకు 6,006 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా ఆ నీరు బుగ్గవాగుకు చేరుతోంది. బుగ్గవాగు నుంచి సాగర్ ప్రధాన కాలువలకు 4,750 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. ఆనీటిని గుంటూరు బ్రాంచ్ కాలువకు 1,750 క్యూసెక్కులు పంపిణీ చేస్తున్నారు. సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు(ప్రకాశం బార్డర్) 1,124 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది. దర్శి బ్రాంచ్ కాలువ మీదుగా ఒంగోలు బ్రాంచ్ కాలువకు వచ్చేసరికి 660 క్యూసెక్కులు పంపిణీ అవుతుంది. అనేక మేజర్లకు కూడా నీరు సరఫరా అవుతుండటంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

అయినా సాగుపై సందిగ్ధం.. నీరు రాకపై సందేహం..!

సాగర్ కాలువలకు పుష్కలంగా నీటి సరఫరా

వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న అన్నదాతలు

ఈ నెల మొదట్లో నీళ్లు ఇచ్చినట్లే ఇచ్చి ఆపేసిన అధికారులు

తాజా విడుదలలోనూ స్పష్టత ఇవ్వని యంత్రాంగం

దర్శి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువల్లో నీళ్లు పరవళ్లు తొక్కుతున్నాయి. రెండు రోజులుగా పుష్కలంగా సరఫరా అవుతున్నాయి. దర్శిలో ప్రధాన కాలువతోపాటు బ్రాంచ్ కాలువ ఆయకట్టు కింద వరి నాట్లకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం విడుదలైన సాగర్ జలాలు వరినాట్ల కోసమా, ప్రాజెక్ట్‌ల్లోకి భారీ వరద నేపథ్యంలో గతంలో మాదిరిగా నీటిని కాలువల్లోకి మళ్లించారా అన్న విషయాన్ని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేయడంలేదు. ప్రస్తుతం విడుదలైన నీరు సాగుకేనన్న ఉద్దేశ్యంతో ఆయకట్టు రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. మాగాణి భూములను దమ్ము చేసి నారు పీకుతున్నారు. అయితే అధికారులు మళ్లీ మధ్యలో నీటి విషయంలో ఇబ్బంది పెడతారేమోననే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

ఈ నెల 1న సాగర్ కాలువలకు నీరు విడుదలయ్యాయి. ఆ సమయంలో వరి సాగుకు నీటిని విడుదల చేశారన్న ఉద్దేశంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు ప్రారంభించారు. వారం గడిచాక నీటి సరఫరాను పూర్తిగా తగ్గించారు. దీంతో చాలా ప్రాంతాల్లో నాట్లు నిలిచిపోయాయి. సాగు చేసిన లేత వరినాట్లు వాడుముఖం పట్టాయి. ఆ సమయంలో ఆకస్మికంగా సాగర్ కాలువలకు నీరు ఎందుకు నిలుపుదల చేశారని ఇరిగేషన్ అధికారులను రైతులు అడగ్గా శ్రీశైలం, సాగర్ జలాశయాలకు వరదనీరు తగ్గడంతో కాలువలకు నిలిపేశామని చెప్పారు. రెండో జోన్‌లో ఉండే మన జిల్లాలోని ఆయకట్టు భూములకు ఆగస్టు చివరి వారంలో కాని, సెప్టెంబరు మొదటి వారంలో కాని సాగునీరు విడుదల చేస్తామని ఆ సందర్భంలో అధికారులు తెలిపారు. దీంతో అన్నదాతలు ఏంచేయాలో పాలుపోక అల్లాడుతున్న పరిస్థితుల్లో వరుణదేవుడు కరుణించి భారీవర్షాలు కురవటంతో లేత వరినాట్లు, పైర్లు ఊపిరిపోసుకొని పచ్చగా కళకళలాడుతున్నాయి.


వరిసాగుకు సిద్ధం చేసిన ఆయకట్టు భూములు

ప్రస్తుతం మళ్లీ సాగర్ జలాలు విడుదల చేయటంతో పంటల సాగుకు నీరు కొనసాగిస్తారనే ధీమాతో రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. రెండురోజులుగా అనేక ప్రాంతాల్లో నాట్లు పడుతున్నాయి. నీటిపై ఇరిగేషన్ అధికారులు మాత్రం ఇప్పటికీ స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. సాగునీటి సరఫరా ఇలాగే కొనసాగిస్తారా, మళ్లీఆకస్మికంగా నిలుపుతారా అనే సంశయం రైతుల్లో ఉంది. ఇప్పటికైనా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేకుంటే మళ్లీ రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

గుబాళిస్తున్న 'పుస్తక పరిమళం'


బుక్ స్టాల్‌లో పుస్తకాలను చూస్తున్న ప్రజలు

ఒంగోలులో బుక్ ఫెస్టివల్‌కు విశేష స్పందన

విజ్ఞాన ప్రపంచాన్ని వీక్షించేందుకు పలువురు ఆసక్తి

విజయవాడ బుక్ ఫెస్టివల్, ఏపీ కల్చరల్ అసోసియేషన్, ఏపీ గ్రంథాలయ పరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 3వ పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసి బుక్ ఫెస్టివల్ పుస్తక ప్రియులతో కళకళలాడుతోంది. ముఖ్యంగా ఆదివారం కావడంతో ప్రతి ఒక్కరూ ప్రదర్శన వీక్షించేందుకు ఆసక్తి చూపారు. ఈ కేంద్రంలో కళాకారులు, కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆధ్యాత్మిక సేవకులు ఇలా ఒకరేమిటి అన్ని వర్గాల వారు వీక్షించేందుకు విచ్చేస్తున్నారు. దాంతోపాటు ప్రముఖ రచయితలు రచించిన పేరుగాంచిన పుస్తకాలు, ఒకటేమిటి అందరినీ ఆకట్టుకుంటున్న బుక్ ఫెస్టివల్ విజ్ఞాన ప్రపంచంలా మారింది. ఆదివారం పుస్తక మహోత్సవాన్ని జేసీ గోపాలకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఐఏఎస్ అవడానికి తెలుగు సాహిత్యం ఎంతో ఉపయోగపడిందన్నారు.

– ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)


మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఘనంగా నాగభైరవ పురస్కార ప్రదానోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరుతో ఏటా నిర్వహించే నాగభైరవ సాహిత్య పీఠం పురస్కారాల పంపిణీ ఉత్సాహంగా భరితంగా సాగింది. స్థానిక రెడ్‌క్రాస్‌భవన్‌లో ఆదివారం డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సినీనటుడు రఘుబాబు మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావుతో తనకు చిన్నతనంలో ఉన్న అనుబంధాన్ని వివరించారు. తానుచిన్నప్పుడు కోటేశ్వరరావును తాతా అని పిలిచేవాడనని అంటూ వారితో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నేత నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) మాట్లాడుతూ ఏటా తుచ తప్పకుండా కోటేశ్వరరావు పేరుతో పురస్కారాలు ప్రదానం చేయడం సముచితంగా ఉందన్నారు. మరో అతిథి మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు, కళామిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, మాట్లాడుతూ సంస్కారవంతమైన కదిలించే కవిత్వాన్ని కళ్లముందుంచి ఆయన కవిత్వమే ఊపిరిగా బతికారన్నారు. రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి రూ.10వేలు, కోనేరు కల్పనకు రూ.5వేలు నగదు బహుమతులు అందజేసి సన్మానం చేశారు. అలాగే డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, చుండి బేబీసుజాతలు కలిసి ప్రదానం చేసిన రూ.10 వేలను నాగభైరవ కళా పురస్కారాన్ని కేకేఎల్ స్వామికి అతిథులు అందజేశారు. నాగభైరవ ఆత్మీయ పురస్కారాన్ని సినీ నటుడు గిరిబాబుకు ఇవ్వాల్సి ఉండగా ఆయన రాని పక్షంలో కుమారుడు రఘుబాబుకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధరంగాల ప్రముఖులు కుర్రా ప్రసాద్‌బాబు, తేళ్ల అరుణ, డాక్టర్ బీరం సుందరరావు, కే బాలకోటయ్య, వి.ఝాన్సీదుర్గ, బీరం అరుణ, సింహాద్రి జ్యోతిర్మయి, కేఎస్‌వీ ప్రసాద్, పోతినేని వెంకటేశ్వర్లు, బెజవాడ రామారావు, డాక్టర్ నాగభైరవ ఆంజనేయులు పాల్గొన్నారు.


సినీనటుడు రఘుబాబును సత్కరిస్తున్న ప్రతినిధులు


మాట్లాడుతున్న శ్రీనివాసులు

24న ఒంగోలులో రాష్ట్రమహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మూడో మహాసభలు ఈనెల 24వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలులో రాష్ట్రమహాసభలు నిర్వహించేందుకు అనేక కారణాలు ఉన్నాయన్నారు. 1975, 80 ప్రాంతంలో నగరంలో ప్రైవేటు బస్సు ఆపరేటర్స్, డ్రైవర్ల సమస్యలపై ఉద్యమించి విజయం సాధించారన్నారు. సింగరాయకొండ పట్టణంలో వేలాది మంది మోటార్ వర్కర్స్ కార్మిక సమస్యలపై పెద్ద ఎత్తున పోరాడారని గుర్తుచేశారు. ఈ రెండు పోరాటాలు జిల్లాలో రవాణా రంగం అభివృద్ధికి తోడ్పాటును అందించాయన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగకార్మికుల పట్ల చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన 21జీవో వల్ల జరిమానాలు, శిక్షణలు, అపరాధ రుసుంలు పెంచడం వల్ల కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభల్లో ఆయా అంశాలపై చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, తంబి శ్రీనివాసులు, దాసరి మల్లికార్జునరావు, మున్వర్ బాషా పాల్గొన్నారు.

31లోపు ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపకార వేతన పరీక్ష నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు ఈనెల 31లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పంపాలని, ప్రభుత్వ, స్థానిక సంస్థల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని వివరించారు. 7వ తరగతిలో కనీసం 55శాతం మార్కులు సాధించాలని, ఎస్సీఎస్టీ విద్యార్థులకు 5శాతం మార్కులు మినహాయింపు ఉంటుందని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.3.5 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయం, నవోదయ, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు అర్హులు కాదని తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన వారిని స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేస్తారని, విద్యార్థికి ఏడాదికి రూ.12వేలు బ్యాంకు ఖాతాకు జమ చేస్తారని పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం వస్తుందని తెలిపారు.

వైభవంగా శ్రీకృష్ణమందిరం జీర్ణోద్ధరణ మహోత్సవం

చీమకుర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలోని ఇసుకవాగు సెంటర్ సమీపంలో శ్రీకృష్ణమందిరం జీర్ణోద్ధరణ, మహాకుంభాషేక మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. నూతన శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సంప్రదాయబద్ధంగా విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున విచ్చేసి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుని మూలవిరాట్

చిన్నారిపై దాడి చేసింది చిరుతే

గూడెంవాసులు అప్రమత్తంగా ఉండాలన్న రేంజ్ అధికారి హరి

పెద్దదోర్నాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని చిన్నారుట్ల గిరిజన గూడెంలో నిద్రిస్తున్న చిన్నారిపై దాడి చేసింది చిరుతేనని దోర్నాల రేంజ్ అధికారి హరి ఆదివారం తెలిపారు. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారిని చిరుత పులి నోట కరుచుకొని వెళ్తుండగా గమనించిన తల్లిదండ్రులు అంజయ్య, లింగేశ్వరి కేకలు వేయడంతో పాపను వదిలి పారిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అటవీ శాఖాధికారులకు పలు సందేహాలు ఏర్పడ్డాయి. చిన్నారిని తీసుకుపోయింది చిరుతపులా.. లేక మరేదైనా జంతువా.. అని ఆలోచనలో పడ్డారు. ఈ క్రమంలో గూడెం పరిసరాల్లో 15 చోట్ల నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి, ఆ శాఖ సిబ్బంది మొబైల్ టీమ్ రహస్య పర్యవేక్షణ చేశారు. రెండ్రోజుల పాటు ఎలాంటి జంతువు జాడా సీసీ పుటేజీకి చిక్కలేదు. శనివారం రాత్రి గూడెం పరిసరాల్లో చిరుత పులి సంచరిస్తూ కెమెరాకు చిక్కింది. దీంతో అటవీ శాఖాధికారులు ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించారు. చిరుత పులి వల్ల ఎలాంటి నష్టం వాటిల్లక ముందే వారి ఆదేశాల మేరకు చిరుతను పట్టి మరేదైనా అభయారణ్యంలో వదలడమా, రక్షణ చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో హరి తెలిపారు. మనిషి రక్తం అలవాటు పడితే ప్రమాదకరమన్నారు. గూడెం వాసులు రాత్రివేళ బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలను జారీచేశారు. అటవీ శాఖ సిబ్బంది నిత్యమూ పర్యవేక్షిస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హరి స్పష్టం చేశారు.


కెమెరాకు చిక్కిన చిరుత పులి

ఉత్సాహంగా యోగాసన జిల్లా స్థాయి పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏకేవీకే కళాశాలలో జిల్లా స్థాయి యోగాసన పోటీలను నిర్వహించారు. పతాంజలి యోగ పీఠ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ యోగాచార్యగంధవళ్ల పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనడమే కాక ఒలంపిక్స్ దాకా వెళ్లవచ్చని బాలాజీ తెలిపారు. ఉద్యోగ అవకాశాలలో మూడు శాతం రిజర్వేషన్ కూడా కల్పించినట్లు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ గంగరాజు నాగేశ్వరరావు, పతంజలి కార్యదర్శి సుధీంరన్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన వారికి ఈనెల 21న తాడేపల్లిగూడెంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. సెప్టెంబరు 25న నేషనల్ స్థాయి పోటీలు విజయవాడలో జరుగుతున్నట్లు కార్యక్రమ నిర్వహకులు సోమా సుబ్బారావు, బోయపాటి రవి, ఉపాధ్యక్షులు,అడ్వకేట్ దేవకుమారి, జాయింట్ సెక్రటరి కేవి శేషారావులు తెలిపారు.


విజేతలకు బహుమతులను పంపిణీ చేస్తున్న అతిథులు

ఒంగోలులో ఘనంగా జాతీయ కరాటే పోటీలు

హాజరైన ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, ముత్తుముల

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ కరాటే డు అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 43వ జాతీయ స్థాయి కరాటే పోటీలు ఆదివారం ఒంగోలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోటీలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాహకులు, జాతీయ కోచ్ నల్లూరి మోహన్‌రావు నేతృత్వంలో జాతీయ స్థాయి పోటీలు ఒంగోలులో నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ప్రతి క్రీడాకారుడు గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని చెప్పారు. కరాటేతో ఆత్మస్థైర్యం, కృషి, పట్టుదల లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ఎమ్మెల్యేలు బీఎన్, ముత్తుముల బహుమతి ప్రదానం చేశారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ 30ఏళ్లుగా కరాటే అకాడమీ నిర్వహిస్తూ మోహన్‌రావు ఎందరో క్రీడాకారులను జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దారన్నారు. ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆత్మ రక్షణకు కరాటే మరింత ఉపయోగపడుతుందని చెప్పారు. అకాడమీ ప్రెసిడెంట్ మండవ మురళీకృష్ణ, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఆలిండియా కోచ్ కొండూరు, శ్రీప్రతిభ సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, డాక్టర గుండవరపు రాఘవ, శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, మండవ సుబ్బారావు పాల్గొన్నారు. ఒకరోజు జరిగిన ఈ పోటీలలో 12 రాష్ట్రాల నుంచి 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, ముత్తుముల

9, 10 తరగతుల్లో 3వ టాపిక్ తొలగింపు

ఒంగోలు విద్య, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిది, పదో తరగతుల సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల్లోని 3వ టాపిక్‌లను సిలబస్ నుంచి తొలగిస్తూ ఎస్సీఈఆర్టీ ఉత్తర్వులు జారీచేసింది. తరగతి గదిలో విద్యార్థులకు ఈ మూడు అంశాలను బోధించాల్సిన అవసరం లేదు. ఈ మూడు అంశాలనుంచి పరీక్షల్లో ప్రశ్నలు కూడా ఇవ్వరు. 10వ తరగతిలో పాఠ్యపుస్తకంలోని మూడవ టాపిక్ ప్రింట్ కల్చర్ (భారతదేశం, సమకాలీన ప్రపంచం)ను సిలబస్ నుంచి తొలగించారు. 9వ తరగతి పాఠ్యపుస్తకం నుంచి 3వ టాపిక్ నాజిస్మ్ అండ్ రిఫైజ్‌ఆఫ్ హిట్లర్(భారతేదశం, సమకాలీన ప్రపంచం) 5వయూనిట్ పాస్టోరలిస్ట్ ఇన్-ది యో డ్రన్ వరల్డ్ అంశాలను సిలబస్ నుంచి తొలగించారు.

అమరావతి - కడప రోడ్డు అధ్వానం

- అల్లినగరంలో గుంతలతో ఇబ్బందులు
- ప్రమాదాలకు నిలయంగా రాష్ట్రీయ రహదారి

కొమరోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల నిర్లక్ష్యానికి సాక్ష్యాలుగా అమరావతి - కడప రాష్ట్రీయ రహదారిలోని జిల్లా సరిహద్దు గ్రామమైన తిమ్మారెడ్డిపల్లి నుంచి తాటిచర్ల మోటు వరకు లోతైన గుంతలు దర్శనమిస్తాయి. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యల్లో వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. ఎన్‌డీఏ ప్రభుత్వం గుంతలను తాత్కాలికంగా పూడ్చినా చిన్న వర్షానికే ఈ రోడ్డులో ప్రయాణించాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. ప్రకాశం జిల్లా సరిహద్దు తిమ్మారెడ్డిపల్లి రోడ్డు నుంచి తాటిచర్లమోటు వరకు గుంతలుగా ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతాన్నారు. మండలంలోని అల్లినగరం గ్రామంలోకి రాగానే సుమారు 3 నుంచి 4 అడుగుల లోతైన గుంతలు దర్శనమిస్తాయి. ఈ రోడ్డుపై కొత్తవారు ప్రయాణిస్తే ప్రమాదానికి గురికావల్సిందే. వర్షాలు పడితే రోడ్లపై నీరు నిలిచి గుంతలు కనిపించక పెద్ద ఎత్తున వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అల్లినగరం, కొమరోలు ప్రధానరోడ్డు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో వేసిన సిమెంట్ రోడ్లు గుంతలుగా ఏర్పడి దారుణంగా


అల్లినగరం గ్రామంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మారింది. దీంతో ఆయా గ్రామాల్లో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన రోడ్డుతోపాటు పామూరుపల్లి, తాటిచర్ల మోటు సమీపంలో బ్రిడ్జికి ఇరువైపుల రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రోడ్డుపై కూడా గుంతను పూడ్చిన దాఖలాలు లేవని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డు కావడం, గుంతలు, వాహనాల రద్దీతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి అమరావతి - కడప రాష్ట్రీయ రహదారిలోని తిమ్మారెడ్డిపల్లి నుంచి తాటిచర్ల మోటు రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలతో ఉన్న కొమరోలు రాష్ట్రీయ రహదారి

చిప్స్ పరిచారు.. రోడ్డు మరిచారు

- సీ కొత్తపల్లి రోడ్డుతో వాహనదారులకు ఇక్కట్లు
- నాలుగేళ్లుగా కదలని పనులు
- నిత్యం ఇబ్బంది పడుతున్న గంగవరం గ్రామస్థులు

పుల్లలచెరువు : మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా వున్నాయి. గత వారం రోజులుగా కురిస్తున్న చిరుజల్లులకు మండలంలోని పంచాయతీ రాజ్ అధ్వానంగా ఉన్నాయి. గంగవరం-పుల్లలచెరువు, రంగనపాలెం-కుందంపల్లి, మానేపల్లి-అయ్యాగానిపల్లె, ముటుకుల-రెంటపల్లి, చాపలమడుగు- సీ కొత్తపల్లి రోడ్లలో ప్రయాణం చేయాలంటే నరకం చూడాల్సిందేనని వాహనదారులు అంటున్నార.

చాపలమడుగు - సీ కొత్తపల్లికి ఏళ్లుగా సరైన రోడ్డు లేదు. ప్రజలు నిత్యం ఎర్రగొండపాలెంకు సరుకులు, వ్యవసాయ అవసరాలకు వెళ్లి వస్తుంటారు. రోడ్డు సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2014లో, 2019లో టీడీపీ పాలనలో ప్రత్యేక ప్యాకేజీ కింద రోడ్డు మంజూరు చేసింది. అయితే పనులు మొదలు పెట్టి చిప్స్ తోలగానే ఎన్నికల కోడ్ కారణంగా రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం కాంట్రాక్టరు మరో సారి రెండవ లేయర్ చిప్స్ పోశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బిల్లులు ఇవ్వరన్న భయంతో కాంట్రాక్టర్ రోడ్డు అభివృద్ధిని మరిచారు. దీంతో ఆరేళ్లుగా పనులు నిలిచిపోయాయి. దాని నిర్మాణం కోసం తోలిన చిప్స్ లేచిపోయి వర్షం పడినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న గంగవరం-పుల్లలచెరువు రోడ్డు


రంగనాయక స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కందుల

వైభవంగా రంగ నాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామంలో భూదేవి శ్రీదేవి సమేత రంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా జరిగిన ప్రతిష్ఠోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, అన్నా రాంబాబు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, యువకులు, మహిళలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.


ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

బాలిక మృతి బాధాకరం

రాచర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : బాలిక కరుణ మృతి బాధాకరమని బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల అన్నారు. తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతూ అనారోగ్యానికి గురై కంభం ప్రభుత్వ వైద్యశాలలో శనివారం చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో ప్రిన్సిపాల్ శనివారం రాత్రి బాలిక స్వగ్రామం వెలగలపాయకు వెళ్లి బాలిక కరుణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలిక జ్వరానికి గురైందని వెంటనే నర్స్ చికిత్సనందించి మందులు వేయడంతో జ్వరం తగ్గిందన్నారు. తర్వాత ఇంటికి తీసుకెళ్లిన తర్వాత పాప మృతి చెందినట్లు తెలియడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెతోపాటు పాఠశాల హౌస్ టీచర్ విజయలక్ష్మి, నర్స్ సత్యసుధ ఉన్నారు.


బాలిక మృతదేహాన్ని సందర్శించిన ప్రిన్సిపాల్ మేరీ మంజుల

బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

వైద్యాధికారి రమేష్

బాలికలు ఆరోగ్యంపట్ల జాగ్రత్తగా ఉండాలని అనుములవీడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ కే రమేష్ అన్నారు. రాచర్ల బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం తమ సిబ్బందితో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 35మందిని పరీక్షించి వారిలో ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వైద్య సేవలందించారు. ఇబ్బంది కలిగించే వ్యాధులు ఎవరికీ లేవని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ రమేష్ తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది జీ వెంకటేశ్వర్లు, వై.రంగనాయకులు, ఎం.ప్రసాద్, శ్రీనివాసులు, ఎన్.రామాంజనేయులు, ప్రీతి పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల, ప్రీతి పాల్గొన్నారు. ఇన్‌చార్జి డీసీవో అరుణ, ఎంఈవో గిరిధర్‌శర్మ సందర్శించారు.

వెలిగొండకు నిధులు కేటాయించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2000 కోట్లు కేటాయించాలని సీపీఐ నాయకుడు అందె నాసరయ్య అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో ఒంగోలులో ఈనెల 23న జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు షేక్ ఖాసిం, కృష్ణారావు, శేఖర్, కాశయ్య పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినం ఆదివారం భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేతుడై శ్రీకృష్ణుని అలంకారంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి మోతకాపుల చెన్నకేశవస్వామి నామ స్మరణల మధ్య ఉట్ల మండపం వద్ద వేయింపు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఉట్ల మండపంలో ఉభయదేవేర్లతో కూడిన చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నరాయునిపల్లెకు చెందిన యాదవులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలు తిలకించారు. ఉట్ల మండపంలోని చెన్నకేశవుని దర్శించుకుని పూజలు చేశారు. ఉట్టి కొట్టిన అనంతరం చెన్నకేశవ పెరుమాళ్‌కు 4 మాడవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈవో


అంకాలమ్మ తల్లి


ఉట్టి కొడుతున్న యాదవులు

గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

పట్టణ శివారులలోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా జాతర

తర్లుపాడు : అంకాలమ్మ తల్లి ఆదివారం జాతర వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి తర్లుపాడు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవనగరంలో ఊరేగింపు

కంభం : కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం కంభం మండలం దేవనగరంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణ భగవానుడి ఉత్సవ విగ్రహం ఊరేగింపు కనులపండువగా జరిగింది. ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దేవనగరంలో ఊరేగింపు నిర్వహించారు. భగవద్గీత శ్లోక ఉచ్చరణలతో భక్తులు పరవశించి ఊరేగింపులో పాల్గొన్నారు.


దేవనగరంలో శ్రీకృష్ణుని ఊరేగింపు

మరుగుదొడ్ల నిర్మాణం జరిగేనా..?

- వైసీపీ నేతల అండతో కబ్జా
- అక్కడి రూంలు నేలమట్టం
- నేటికీ పట్టించుకోలేదని ప్రజల ఆగ్రహం

పొదిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పెద్ద బస్టాండ్ సెంటర్లో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను గత వైసీపీ పాలనలో రాత్రికి రాత్రే భూకబ్జాదారులు నేలమట్టం చేశారు. ఈ ఘటన జరిగి సుమారు 3 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వారిపై చర్యలు లేకపోగా మరుగుదొడ్లను నిర్మించక పోవడం విమర్శలకు తావిస్తోంది. సుమారు 15 సంవత్సరాల కిందట డాక్టర్ స్వర్ణగీత పంచాయతీ సర్పంచిగా ఉన్న సమయంలో ప్రయాణీకుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఓ ప్రైవేటు వ్యక్తికి మరుగుదొడ్ల నిర్మాణాన్ని లీజుకు ఇచ్చారు. లీజు హక్కు పొందిన ఆవ్యక్తి పంచాయతీకి చెందిన విలువైన స్థలంలో పక్కా మరుగుదొడ్లు నిర్మాంచి పే అండ్ యూజ్ పద్ధతిలో 12 ఏళ్లకుపైగా నిర్వహిస్తూ వచ్చారు. మరో 13 ఏళ్ల లీజుకాలం ఉండగానే విలువైన ఆ స్థలంపైన కబాదారుల కన్నుపడింది. వైసీపీ నాయకుల అండతో మరుగుదొడ్లను ఖాళీ చేయాలని లీజు హక్కుదారుడిని బెదిరించారు. తనకు ఇంకా 13 ఏళ్లపాటు లీజుకాలం ఉన్నందున ఖాళీ చేయబోనని ఆయన స్పష్టం చేశారు. దాంత ఆగ్రహించిన భూకబ్జాదారులు రాత్రికిరాత్రి ఎక్స్‌కవేటర్‌తో మరుగుదొడ్లను నేలమట్టం చేశారు. అక్రమార్కుల దురాగాతంపై లీజుదారుడు అప్పట్లో పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరుగుదొడ్లను కూలగొట్టి మూడు సంవత్సరాలు దాటుతున్నా నగరపంచాయతీ అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోగా వాటి పునర్ నిర్మాణానికి కూడా చొరవచూపలేదు. అధికారులు పట్టణంలోని ప్రధాన దహదారి పక్కనే సుమారుగా రెండుకోట్ల రూపాయల విలువైన పంచాయతీ స్థలాన్ని కూల్చివేసినప్పటికీ చర్యలు చేపట్టకపోవడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదవారికి ఒకన్యాయం ధనవంతులకు మరో న్యాయమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దర్శి, అద్దంకి, కొనకనమిట్ల, మర్రిపూడి, చీమకుర్తి, ఒంగోలు మండలాలకు నడికూడలిలో ఉన్న బస్టాండ్‌లో నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకల కోసం వేచి ఉంటారు. మండలంలో ఎక్కడి నుంచి వచ్చినా పెద్దబస్టాండ్‌కు రావాల్సి ఉంటుంది. ముఖ్యంగా మహిళలు వారి వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందకు మరుగుదొడ్లు లేకపోవడంతో వారి ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతుంది. సెంటర్లో దిగిన ప్రయాణికులు, ప్రజలు మూత్రశాలకు వెళ్లాలంటే చాలాదూరం చెల్లచాటుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లుగా పెద్దఎత్తున ప్రజలు మరుగుదొడ్లు నిర్మించాలని నగరపంచాయతీ అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించి ప్రజల అవసరాలు తీర్చడంతోపాటు కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అక్రమార్కులు ధ్వంసం చేసిన మరుగుదొడ్ల స్థలం (ఫైల్)

త్వరలోనే నిర్మిస్తాం

స్థలాన్ని పరిశీలించి చదును చేయించాం. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే ఉన్నతాధికారుల సూచనల మేరకు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

\- కేఎల్ఎన్ రెడ్డి,
నగర పంచాయతీ కమిషనర్


దాతలు ఇచ్చిన బహుమతులతో విద్యార్థులు

విజేతలకు బహుమతుల ప్రదానం

గిద్దలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో తేజశ్విని, భార్గవి, యోగితారెడ్డి, జూనియర్స్ విభాగంలో గీత, రామ్‌చరన్, శన్ముఖప్రియలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా దాతల సహకారంతో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్, బాలవికాస్ పాఠశాల ప్రతినిధి శశికళ, దాతలు పాలుగుళ్ల రామస్వామిరెడ్డి, చిట్టెం మార్క్ పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం అందజేత

ఎర్రగొండపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. స్థానిక జూనియర్ కాలేజీ 1977-79 పూర్వపు విద్యార్థిని తోటపల్లి కిష్టకుమారి భర్తకు ఆరోగ్య ఖర్చులకు గాను పూర్వ విద్యార్థులు ఆదివారం ఒంగోలు వెళ్లి రూ.17,500 అందజేశారు. కృష్ణకుమారి భర్త కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆర్థిక సాయం అందించామని స్నేహితులు షేక్ ఖాసిం, యక్కలి భాగ్యరావు, మల్లికార్జునరావు, జ్యోతి ప్రసాద్, సూరే వెంకట స్వామి, జార్జి, మురళి తెలిపారు.

ఒంగోలు నివాసం ఉంటున్న విశ్రాంత అధ్యాపకుడు ఎస్.వెంకటస్వామి దంపతులు, విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు పీ సుబ్బరాయుడు దంపతులను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

గిద్దలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ గిద్దలూరు మండల మహాసభలు ముగిశాయి. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బి.నరసింహులు, కోకన్వీనర్లుగా విశ్రాంతమ్మ, మున్నా, కమిటీ సభ్యులుగా కుమారి, మేరి, సాయిలక్ష్మి, రంగయ్య, పిచ్చిరెడ్డి, మురళి, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల మహాసభలో పలు తీర్మానాలు చేశారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో పని చేస్తున్న స్కీం వర్కర్లకు, చిరు ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలి. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ఆటో, ముఠా కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, నూతన పింఛన్ స్కీంను రద్దు చేసి పాత పింఛన్ స్కీంను కొనసాగించాలని మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య తెలిపారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నూతన కమిటీ



మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నూతన కమిటీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన కమిటీని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫి మాట్లాడుతూ.. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిగా సుబ్బరాయుడు, కార్యదర్శిగా జి.హరికృష్ణ, సహాయ కార్యదర్శిగా రమణ, బ్రహ్మం, కోశాధికారిగా చెన్నరాయుడు, ఉపాధ్యక్షులుగా చెన్నకేశవులు, గౌరవ అధ్యక్షుడిగా రూబెన్, గౌరవ సలహాదారుగా సలాంఖాన్ ఎన్నికయ్యారు.

అసంపూర్తిగా గ్రామ సచివాలయలం

- కొమరోలులో నిలిచిన ఆర్ఎస్‌కే, హెల్త్ క్లినిక్ సెంటర్
- భవనాలు లేక ఉద్యోగులు, ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


కొమరోలులో మధ్యలో నిలిచిన సచివాలయ భవనం

పుల్లలచెరువు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అవసరాల తీర్చేందుకు వైసీపీ పాలనలో కొమరోలులో నిర్మించిన ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసీపీ పాలలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.40లక్షలతో గ్రామ సచివాయలం, రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20లక్షలతో హెల్త్ క్లినిక్ సెంటర్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. భవనాల కోసం ప్రభుత్వం కేటాయించిన 600 టన్నుల ఇసుకను అప్పటి వైసీపీ నాయకులు అక్రమంగా దోసుకున్నారు. దీంతో ఏడాది పాటు పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు పనులను చేసి మధ్యలోనే నిలిపి వేశారు. సచివాలయం 60 శాతం వరకు పనులు చేసిన పినిషింగ్ పనులు చేయకుండానే అసంపూర్తిగా వుంది. రైతు భరోసా కేంద్రం 50 శాతం పనులు జరిగి అసంపూర్గిగా ఉంది. హెల్త్ క్లినిక్ సెంటర్‌కు స్లాబ్ వేసి వదిలిలేశారు. గత 5 సంవత్సరాలు కిందట పనులు ప్రారంభించిన నేటికీ అసంపూర్తిగా మిలిగి పోయాయి. దీంతో భవనాలు లేక సచివాలయ ఉద్యోగులు, ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. గత 5 ఏళ్లుగా పనులు పూర్తి కాకపోయిన సంబంధిత పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పనుల వైపు కన్నెత్తి కుడా చూడడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టరు స్పందించి వెంటనే పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కొమరోలులో నిర్మాణానికి నోచుకోని హెల్త్ క్లినిక్ సెంటర్

వాలీబాల్ పోటీలకు విజయ్‌కుమార్ ఎంపిక


విజయ్‌కుమార్

దర్శి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారాసిట్టింగ్ వాలీబాల్ వరల్డ్‌కప్ పోటీలకు దర్శి పట్టణానికి చెందిన వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. అక్టోబరు 8 నుంచి 18 వరకు అమెరికాలో జరిగే పారాసిట్టింగ్ వాలీబాల్ వరల్డ్‌కప్ పోటీల్లో భారతదేశం తరుపున ఆడే అవకాశం విజయ్‌కుమార్‌కు లభించింది. 2023లో ఆసియన్ జోన్ పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో కూడా విజయ్‌కుమార్ భారత దేశం తరుపున పోటీల్లో పాల్గొన్నారు. రెండో సారి దేశం తరుపున ఆడే అవకాశం రావటం పట్ల విజయ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. అవకాశం కల్పించిన వాలీబాల్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పేదవారిని ఆదుకోవాలి

కనిగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమతలేని పేద కుటుంబాలకు ప్రతిఒక్కరూ చేదోడుగా నిలవాలని పాస్టర్‌లు వి.ప్రసాద్, జయరావు అన్నారు. పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీలోని గిరిజనులకు ఆదివారం ఎమ్మమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందినవారిని ఆదుకోవటం ప్రతిఒక్కరి బాధ్యతగా భావించాలని కోరారు. ఇకనుంచి పేద కుటుంబాలకు ఫౌండేషన్ ద్వారా నిత్యావసర సరుకులు అందజేయనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామంలో భూదేవి శ్రీదేవి సమేత రంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా జరిగిన ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం తో ముగిసాయి. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, అన్నా రాంబాబు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, యువకులు, మహిళలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినం ఆదివారం భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేతుడైన శ్రీకృష్ణుని అలంకారంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి మోతకాపు ల చెన్నకేశవస్వామి నామ స్మరణల మధ్య ఉట్ల మండపం వద్ద వేయింపు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ పతి అప్పనాచార్యులు ఉట్ల మండపంలో ఉభయదేవేర్లతో కూడిన చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నరాయునిపల్లెకు చెందిన యాదవులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలు తిలకించారు. ఉట్ల మండపంలోని చెన్నకేశవుని దర్శించుకుని పూజలు చేశారు. ఉట్టి కొట్టిన అనంతరం చెన్నకేశవ పెరుమాళ్‌కు 4 మాడవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

మరుగుదొడ్ల నిర్మాణం జరిగేనా..!

పొదిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పెద్ద బస్టాండ్ సెంటర్లో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను గత వైసీపీ పాలనలో రాత్రికి రాత్రే భూ కబ్జాదారులు నేలమట్టం చేశారు. ఈ ఘటన జరిగి సుమారు 3 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వారిపై చర్యలు లేకపోగా మరుగుదొడ్లను నిర్మించకపోవ డం విమర్శలకు తావిస్తోంది. సుమారు 15 సంవత్సరాల కిందట డాక్టర్ స్వర్ణగీత పంచాయతీ సర్పంచిగా ఉన్న సమయంలో ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఓ ప్రైవేటు వ్యక్తికి మరుగుదొడ్ల నిర్మాణాన్ని లీజుకు ఇచ్చారు.

లీజు హక్కు పొందిన ఆవ్యక్తి పంచాయతీకి చెందిన విలువైన స్థలంలో పక్కా మరుగుదొడ్లు నిర్మించి పే అండ్ యూజ్ పద్ధతిలో 12 ఏళ్లకుపైగా నిర్వహిస్తూ వచ్చారు. మరో 13 ఏళ్ల లీజుకాలం ఉండగానే విలువైన ఆ స్థలంపైన కబ్జాదారుల కన్నుపడింది. వైసీపీ నాయకుల అండతో మరుగుదొడ్లను ఖాళీ చేయాలని లీజు హక్కుదారుడిని బెదిరించారు. తన కు ఇంకా 13 ఏళ్లపాటు లీజు కాలం ఉన్నందున ఖాళీ చేయబోనని ఆయన స్పష్టం చేశారు. దాంత ఆగ్రహించిన భూ కబ్జాదారులు రాత్రికిరాత్రి ఎక్స్‌కవేటర్‌తో మరుగుదొడ్లను నేలమట్టం చేశారు. అక్రమార్కుల దురాగాతంపై లీజుదారుడు అప్పట్లో పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దర్శి, అద్దంకి, కొనకనమిట్ల, మర్రిపూడి, చీమకుర్తి, ఒంగోలు మండలాలకు నడికూడలిలో ఉన్న బస్టాండ్‌లో నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకల కోసం వేచి ఉంటారు. మహిళలు వారి వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేకపోవడంతో వారి ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతుంది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించి ప్రజల అవసరాలు తీర్చడంతోపాటు కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశం

వీసీపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివాకరపల్లిలో నిర్మిస్తున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించారు. ప్లాంట్‌ను సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్లాంట్‌ను త్వరగా నిర్మిస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అలాగే కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఉపాధి కోసం వలస పోకుండా ఇక్కడే పని దొరుకుతుందని చెప్పారు. తద్వారా వలస నివారణ జరుగుతుందన్నారు. ప్లాంట్ కోసం గడ్డి పెంచేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అందుకోసం తీసుకొచ్చిన నూతన ట్రాక్టర్‌లను పరిశీలించారు. ఆయనవెంట టీడీపీ నాయకులు ఉన్నారు.


ప్లాంట్ నిర్మాణ పనుల గురించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలో గల గంగమ్మ తల్లికి ఆదివారంప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో ఆలయంలో సందడి నెలకొంది. గంగమ్మ తల్లిని భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు వాహన పూజలు చేయించుకున్నారు. మరికొందరు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకపూజారి ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో నారాయణస్వామి మూలవిరాట్

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఈసందర్భంగా ఆలయ గాలిగోపురం వద్ద నుంచి మేళతాళాలతో ఆలయ ప్రదర్శనచేసి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోశాలలో గోవులకు పసుసు కుంకుమలతో హారతి ఇచ్చి గోపూజ నిర్వహించారు. భక్తులకు నైవేద్యం పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. ముండ్లమూరు, పోలవరం, బొప్పూడివారిపాలెం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, రమణారెడ్డిపాలెం, పసుపుగల్లు గ్రామాల్లో పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేశారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ఎగువపల్లి గ్రామంలో ఆదివారం రామాలయం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, కదిరి పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హతకల్గిన దివ్యాంగులందరికీ పింఛన్‌లు

» మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వం పింఛన్‌లు అందజేస్తుందని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 13వ వార్డులో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా సాంకేతిక సమస్యతో పింఛన్‌ను తొలగించిన విషయాన్ని కొంతమంది దివ్యాంగులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యశాతం ఎక్కువగా ఉన్నవారి పింఛన్‌లు తొలగిస్తే వారికి తప్పనిసరిగా మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. పింఛన్‌లు తొలగించిన వారు ప్రభుత్వాసుపత్రిలోని సదరమ్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని చైర్మన్ సూచించారు. కనిగిరిలో పరీక్షా కేంద్రం లేదని బాధితులు తెలిపారు. వైకల్యభారంతో ఇబ్బందులు పడుతున్న తాము తిరగకలేకపోతున్నామని తెలిపారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


దివ్యాంగుల వివరాలను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

చవితికి సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు

దొనకొండ, ఆగస్టు 17: వినాయక చవితికి విగ్రహాలు సిద్ధమయ్యాయి. ఏటా ప్రత్యేక మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసి పూజలు చేస్తారు. గతంలో మార్కాపురం, దర్శి, వినుకొండ తదితర ప్రాంతాల నుంచి భారీ గణనాథుడి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో వ్యయప్రయాసాలకోర్చి గ్రామాలకు తరలించేవారు. గణనాథుల విగ్రహాల తయారు నిమిత్తం కొన్ని నెలల క్రితం దొనకొండ ప్రధాన రహదారిలో స్థలం అద్దెకు తీసుకొని తయా రుచేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన కళాకారులు నిర్విరామంగా వివిధ ఆకృతుల్లో గణనాథుల విగ్రహాలను సర్వాంగ సుందరంగా రూపొందించి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. ఈనెల 27న నిర్వహించే వినాయక చవితి వేడుకల సందర్భంగా భారీ గణనాథుల విగ్రహాలు కొనుగోలు నిమిత్తం ఇత ర ప్రాంతాలకు వెళ్లే అవసరంలేకుండా ఇక్కడే ఏర్పాటుచేశారు. కొందరు నచ్చిన ప్రతిమను ఎంపిక చేసుకొని అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు.


గణనాథుల విగ్రహాలను సిద్ధం చేస్తున్న కళాకారుడు

ఎంపీడీవోను నియమించరూ..

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాళ్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు ఎంపీడీవో అనారోగ్యంతో సెలవు పెట్టారు. డిప్యూటీ ఎంపీడీవో దారా హనుమంతరావును ఇన్‌చార్జ్‌గా నియమించగా, ఆయన గత సోమవారం నుంచి అనారోగ్యంతో 15రోజులపాటు సెలవుపై వెళ్లారు. ఆయన సెలవుపై వెళ్లి వారం రోజులు కావస్తున్నా ఇంతవరకు ఉన్నతాధికారులు ఎవరినీ నియమించలేదు. దీంతో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. వారం రోజులుగా ఎంపీడీవో సెల్‌ను ఎవరూ వినియోగించటంలేదు. సమస్యలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యక్రమాలపై కిందిస్థాయి, ఉన్నతాధికారులు ఎంపీడీవోకు ఫోన్ చేయాలంటే అందుబాటులో లేదు. దీంతో ఎవరకి విన్నవించాలో తెలియక సమతమతమవుతున్నారు.

వారం క్రితం ఎంపీడీవో ఉన్నతాధికారులకు తెలియపరిచి సెలవుపై వెళ్లి వారం రోజులదాటినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవటంవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాలనా సౌలభ్యం కోసం మరో అధికారికి ఇన్‌చార్జ్ ఎంపీడీవో బాధ్యతలు అప్పగించి తమ ఇబ్బందులను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఎంపీడీవో కార్యాలయం

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వీసిపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యోగా పోటీలకు మండలంలోని వెంగళాయపల్లి పాఠశాలకు చెందిన సీహెచ్ జశ్వంత్, సీహెచ్ మానస, పి.శివపార్వతి ఎంపికయ్యారు. ఆదివారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి యోగాపోటీల్లో వెంగళాయపల్లి, నేరేడుపల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14, 15 వయస్సు విభాగం హ్యాండ్ బ్యాలెన్స్ సుపైన్ ఆసనాస్ ఈవెంట్‌లో ప్రథమ స్థానాలు సాధించి మెడల్స్ పొందారు. అలాగే నేరేడుపల్లికి చెందిన స్వర్ణ రేవంత్‌సాయి, స్వర్ణ వెంకటసాయి యశశ్వినీలు అదే విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వెంగళాయపల్లి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య హ్యాండ్ బ్యాలెన్స్, సుపైన్ ఆసనాస్‌లో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చేతులమీదుగా మెరిట్‌పత్రాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయి యోగాపోటీలకు ఎంపికైన వారిని విద్యాశాఖ అధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, విద్యాకమిటి చైర్మన్ చెన్నుపాటి వీరాంజనేయులు అభినందించారు.



జాయింట్ కలెక్టర్ చేతులమీదుగా మెరిట్‌పత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

తాళ్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. ఈఘటన ఆదివారం ఉదయం మండలంలోని తూర్పుగంగవరంలో చోటుచేసుకుంది. తూర్పుగంగవరంకు చెందిన గోనుగుంట చిన వెంకట సుబ్బారావు(74) పొలానికి మోటారుసైకిల్‌పై శివరాంపురం వెళ్లే పొలంబాట మార్గంలో వెళుతున్నాడు. అదేసమయంలో శివరాంపురం నుంచి తూర్పుగంగవరంకు మరోవ్యక్తి మోటార్‌సైకిల్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో పోలేరమ్మ గుడి సమీపాన ఎదురెదురుగా మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. దీంతో బాబూరావు మోటార్‌సైకిల్‌పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వాహనచోదకుడికి స్వల్పగాయాలయ్యాయి.

పాముకాటుకు రైతు మృతి

ముండ్లమూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపాలెంకు చెందిన మానం శ్రీనివాసరావు(50) అనే రైతు ఆదివారం పాము కాటుకు గురై మృతిచెందాడు. తాను సాగుచేస్తున్న మొక్కజొన్న పైరుకు నీరు పెట్టేందుకు మధ్యాహ్నం పొలానికి వెళ్ళాడు. విషసర్పం కాటువేయడంతో వెంటనే సమీపంలో ఉన్న తన కుమారుడికి తెలిపారు. వెంటనే అతను బంధువులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఇంటికి తీసుకెళ్లేలోపే శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుబ్బాయమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఎన్.వెంకటేశ్వరరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన యువకుడు కాకాని ఈస్టర్ బాబు (27) ఆదివారం చెట్టు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అందిన సమాచారం ప్రకారం బల్లికురవ మండలం వేమవరంలోని ఒక గ్రానైట్ పరిశ్రమలో ఈస్టర్‌బాబు సూపర్ వైజరుగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది వేమవరంలో 7, గన్నవరంలో 3 ఎకరాలను కౌలుకు తీసుకొని బర్లీ పొగాకును సాగు చేశాడు. పండించిన పొగాకులో కొంతభాగాన్ని అమ్ముకోగా, ఇంకా కొంత అమ్ముకోవాల్సిఉంది. ఈ నేపథ్యంలో దాదాపుగా రూ. 7 లక్షలకు పైగా బాకీలు ఉన్నాయి. దీంతో అప్పులు తీర్చలేననే మనస్తాపంతో ఈస్టర్ బాబు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఆత్మహత్యపై పూర్తి స్థాయిలో సమాచారం అందలేదని, గ్రామ వీఆర్వోను సమాచారం సేకరించాలని ఆదేశించినట్లు మండల తహసీల్దారు కె. రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ టి. రత్నకుమారి తెలిపారు. ఇదిలా ఉండగా మృతుని కుటుంబసభ్యులను టీడీపీ మండల నాయకులు నల్లపనేని రంగయ్యచౌదరి పరామర్శించారు.

బాధితులకు రిలీఫ్ ఫండ్ విడుదలపై హర్షం

తాళ్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు తక్షణ రిలీఫ్ నిధులు విధుల చేయటంపై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య సీఎం చంద్రబాబు, మంత్రి బాలవీరాంజనేయస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయన తాళ్లూరు వచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీఎస్టీ రిలీఫ్ ఫండ్ రూ. 90 కోట్లు రావాల్సి ఉండగా, రూ.28.30 కోట్లు విడుదల చేశారన్నారు. మిగిలిన రిలీఫ్ ఫండ్‌ను కూడా త్వరితగతిన విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు హత్యకు గురైన సమయంలో ప్రత్యేక పరిస్థితుల్లో రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని సీఎం అధ్యక్షతన జరిగిన మానిటరింగ్ కమిటీ నిర్ణయం అమలుకు నోచుకోక పోవటం బాధాకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలను త్వరగా మంజూరు చేసి ఆదుకోవాలని దారా కోరారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

మద్దిపాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పోలీసులు అలసత్వం వీడి పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదే శించారు. ఆదివారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. స్టేష న్‌లో ఉన్న రికార్డులను, డ్యూటీల కేటాయింపు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. మిస్సింగ్ కేసులు, పెండింగ్ కేసుల విచారణ త్వరతగతిన పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల పరిష్కా రంలో జాప్యం జరిగితే బాధితులకు సత్వర న్యాయం చేయలేమన్నారు. నేరాల కట్టడికి గ స్తీ ముమ్మరం చేయాలని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబరు 112 నుంచి ఫిర్యాదులు రాగానే పోలీ స్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే కళాశాల, పాఠశాల విద్యార్థినులకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌లపై అవగా హన కల్పించాలని సూచించారు. గంజాయి వంటి మారక ద్రవ్యాలు సేవించకుండా చట్టప రమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్‌ఐ బి.శివరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి శునకాలతో ప్రజల బెంబేలు

అద్దంకి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో వీధి శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై ఎగబడుతున్నాయి. దీంతో వీధులలో వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తె పరిస్థితి నెలకొంది. వీధి కుక్కల నియంత్రణ పై మున్సిపల్ అధికారులు మొక్కుబడి చర్యలు మాత్రమే తీసుకుంటుండటంతో అవి మరింత పెరిగి పోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. సంతానోత్పత్తి లేకుండా ఆపరేషన్‌లు చేయించే విధంగా చర్యలు చేపట్టే అవకాశం ఉన్నా మొక్కుబడిగా మాత్రమే చర్యలు చేపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కో వీధిలో పదుల సంఖ్యలో వీధి కుక్కలు ఉండటంతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో మరింత భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికులు ఫుల్.. బస్‌లు నిల్

అద్దంకి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రద్దీ బాగా పెరిగింది. అయితే అందుకు తగ్గట్లు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు లేకపోవటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పటం లేదు. ఆదివారం రోజు కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది.దీంతో సోమవారం నుంచి పరిస్థితి ఏలా ఉంటుందో అనే ఆందోళన ప్రయాణికులలో నెలకొంది. అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి అరకొర బస్సు సర్వీసులు మాత్రమే ఉండటంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఆదివారం వివాహాలు ఉండటంతో మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించారు. ప్రధాన రూట్లలో సైతం బస్సులు సరిపడా లేకపోవటంతో ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వచ్చిన బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు కుస్తీలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయటంతో రద్దీ మరింత పెరిగింది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు ఆర్టీసీ అధికారులు బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం

పంగులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చిలుకూరివారి వంశదేవర శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం పంగులూరులో వైభవంగా జరిగింది. తెనాలికి చెందిన ప్రముఖ వేదపండితులు బ్రహ్మశ్రీ వేములశ్రీహరి పర్యవేక్షణలో వారి రుత్విక్‌లబృందం నిర్ణీత ముహూర్తంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ గావించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామివారు సర్వాంగసుందరంగా రూపుదిద్దుకున్న నూతన ఆలయంలో కొలువుదీరారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొనేందుకు పంగులూరు,చినమల్లవరం, నక్కలపాలెం, నాగండ్ల, ఇంకొల్లు పరిసర ప్రాంతాలకు చెందిన చిలుకూరి వంశస్తులు, వారి ఆడపడుచులు, బంధుమిత్రులు వేలాదిగా తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. దాతలు సమకూర్చిన వెండికిరీటధారణలతో ప్రత్యేకాలంకరణలో శోభిల్లిన శ్రీభద్రకాళీ అమ్మవారిని, వీరభద్రస్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. దేవతామూర్తుల ప్రతిష్ఠాపన అనంతరం శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కన్నుల పండువగా జరిగిన స్వామివారి శాంతి కల్యాణవేడుకలో చిలుకూరి వంశస్తులు సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు.

శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన వేలాదిమంది భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటుచేసింది.





పెనుమూడి దిగువన కరకట్టకు ఆనుకునే తవ్వేసిన రొయ్యల చెరువులు

ఎవరికీ పట్టని.. కరకట్ట



బాపట్ల రూరల్‌లో ముంపు బారిన పడిన వరిపైరు (ఫైల్ ఫొటో)

వీడని.. వాన గండం

- జిల్లాలో నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం
- వాతావరణశాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబర్ హెచ్చరిక



అల్పపీడన ప్రభావంతో ఆరెంజ్ అలర్ట్

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు..

నిజాంపట్నం(రేపల్లె): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో సముద్రంలో ఈదురుగాలులతో కూడిన భారీవర్షాలు పడనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదివారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసేందుకు మత్స్యకారులు ఎవరూ వెళ్ళరాదని సూచించారు. వేట చేసుకునే మత్స్యకారుల కు వాకీటాకీల ద్వారా తక్షణమే ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. వాయుగుండంతో ఈదురుగాలుతో కూడిన భారీవర్షం అలల ఉధృతి పెరుగుతాయని పోర్టు అధికారులు తెలిపారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాను వాన గండం వీడటం లేదు. ఇటీవల దంచికొట్టిన వర్షాలకు పొలాలు చెరువులుగా మారి పైర్లన్నీ ముంపుబారిన పడిన సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 16,325 హెక్టార్లలో పైర్లు ముంపుబారిన పడినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా తేల్చింది. ఇందులో వరి వాటానే 16,197 హెక్టార్లుగా ఉంది. పొలాల్లో నిలిచిన నీళ్ల బయటకు పంపడానికి రైతులు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు కాల్వలను తవ్వుకోగా.. మరికొందరు ఇంజన్లతో నీటిని బయటకు పంపి పైర్లను కాపాడుకున్నారు. దీంతో ఆదివారానికి కొంతమేర పైర్లు బయటపడ్డాయి. ఇంతలోనే మరో వాన గండం రైతులను వణికిస్తోంది. అల్పపీడన ప్రభావంతో సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఇటీవల కురిసిన ఎడతెరిపి వర్షాలకే ఉక్కిరిబిక్కిరయిన రైతులు మళ్లీ వర్ష ప్రకటనతో ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికే కుళ్లిపోయిన పైర్లు

మూడు రోజులు నీళ్లలోనే ఉండడంతో వరిపైరు పూర్తిగా కుళ్లిపోయిందని రైతులు చెబుతున్నారు. వెద పద్ధతిలో సాగు చేశా మని ఎకరాకు రూ.7,000 నుంచి రూ.10,000 వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యాయని అంతా కూడా వర్షార్పణ మేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, వేమూరు, చుండూరు, భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె, నగరం మండలాల పరిధిలోని 69 గ్రామాలపై ఇటీవల కురిసిన వర్షాలు తీవ్రప్రభావం చూపించాయి. కాల్వలు, డ్రెయిన్లలో పూడికతీత తీయకపోవడంతో చేలన్నీ ముంపులో చిక్కుకున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సాగులో దాదాపు 60 శాతం నష్టపోయినట్లేనని, మళ్లీ వానల హెచ్చరికతో వందశాతం నష్టం తప్పకపోవచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.



మున్నంగి-వల్లభాపురం మధ్య నదివైపున సగానికి కుంగిన కరకట్ట

- వరదల సమయంలో హడావుడితో సరి
- దారుణంగా ఉన్నా ఊసేలేని మరమ్మతులు
- ఆక్రమణలతో కాలిబాటను తలపిస్తున్న కరకట్ట
- మళ్లీ వరద ముప్పుతో కట్ట పటిష్ఠతపై భయాందోళనలు

రేపల్లె, తెనాలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ తీరంలోని గ్రామాలకు రక్షణ కవచం లాంటి కుడి కరకట్ట ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు.. ఎక్కడ గండిపడుతుందో ఏగ్రామాలను ముంచేస్తుందోనని ఆందోళనలో ప్రజలు ఉన్నారు. పది అడుగుల వెడల్పు ఉండాల్సిన కట్ట కొన్ని ప్రాంతాల్లో కాలిబాటను తలపించేలా చిక్కిపోయింది. సంవత్సరం క్రితం వచ్చిన వరద సమయంలో రాత్రి, పగలు విరామం లేకుండా మంత్రులు సైతం కరకట్టపై కాపలాకాశారంటే పరిస్థితి అర్థమవుతుంది. ప్రస్తుతం నదిలో నీటి ఉధృతి తక్కువగా ఉన్నా, వరుస వాయుగుండాలు, ముంచెత్తుతున్న వర్షాలతో భయం మాత్రం వెంటాడుతూనే ఉంది. వరదలు వచ్చినప్పుడు నాలుగు మూటలు అడ్డువేయడంతో సరిపెడుతున్నారే కానీ పటిష్ఠతకు శాశ్వత పనులపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. కరకట్టను అనుకునే రొయ్యల చెరువులు తవ్వడం, కట్టల మట్టి తవ్వుకుని అమ్మేసుకుంటున్నా మామూళ్ల వసూలు చేసుకోవడానికి ఆర్సీ అధికారులు పరిమితమవుతున్నారు. దీంతో గుంటూరు జిల్లాలోని ప్రకాశం బ్యారేజి నుంచి బాపట్ల జిల్లా లంకెవానిదిబ్బ మధ్య 102 కిలోమీటర్ల పొడవున్న కరకట్ట పరిస్థితి దయనీయంగా మారింది. కరకట్ట 61 కి.మీటర్ల పొడవులో గుంటూరు, బాపట్ల జిల్లాల కింద 8 కి.మీటర్ల పొడవున దెబ్బతిన్నది. పెనుమూడి నుంచి లంకెవానిదిబ్బ వరకు 38 కి.మీటర్ల పొడవున కేవలం మట్టి పనితో కరకట్ట వదిలేశారు. పెనుమూడి నుంచి లంకెవానిదిబ్బ వరకు కరకట్టకు నదివైపునున్న భూముల్లో రొయ్యల చెరువులు తవ్వేశారు. పెనుమూడి దగ్గర ఆర్సీ కార్యాలయాల దగ్గర్లోనే నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపినా వాటిని అడ్డుకునే వారే లేరు. రాజుకాల్వ-లంకెవానిదిబ్బ మధ్య రెండు నుంచి నాలుగడుగుల వెడల్పు కూడా లేదు. దీంతో ఇప్పుడు వరద వస్తే ఒక్కచోట కాకుండా ఎన్నిచోట్ల గండ్లు పడతాయోనన్న భయం తీరవాసులకు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. గత ఏడాది కృష్ణా నదికి దశాబ్దాల కాలంలో రానంతటి వరద రికార్డు స్థాయిని నమోదు చేసుకుంది. ఆ సమయంలో తాడేపల్లి మండలంలోని విజయవాడ క్లబ్ దగ్గర, ప్రాతూరు-వల్లభాపురం మధ్య కరకట్ట రోడ్డు దారుణంగా మారింది. మొత్తం కుంగిపోయి, ప్రమాదకరస్థితికి చేరింది. వల్లభాపురం వార్ఫ్ దగ్గర మూడడుగుల లోతుకు 300 మీటర్ల పొడవున కుంగిపోయింది.



పెదపులివర్రు-పెనుమూడి మధ్య దారుణంగా మారిన కరకట్ట

పొంచి ఉన్న ముప్పు..

గత ఏడాది వరదల సమయంలో దోనేపూడి, పెదపులివర్రు, పెనుమూడి మధ్య రెండు మూడు ప్రాంతాల్లో కరకట్టపై నుంచి నీరు బ్యాంక్ కెనాల్‌లోకి చొచ్చుకు వస్తుండటంతో ఇసుక మూటలు అడ్డువేసి అడ్డుకున్నారు. దీంతో అప్పటికి గండం గడిచింది. అయితే ఇప్పుడు అదే ప్రాంతాల్లో మళ్లీ భయం కలిగిస్తున్నది. ఎగువన వర్షాలతో పాటు జలాశయాల నుంచి వరద నీరు కిందికి వస్తోంది. దీంతో ఎప్పుడు ఎంత వరద వస్తుందో, ఏ స్థాయిలో విరుచుకుపడుతుందో అర్థంకాని విధంగా నదిలో పరిస్థితి మారింది. కనీసం కట్ట బలహీనంగా ఉన్నచోట ఇప్పుడైనా ముందస్తుగా ఇసుక మూటలు అడ్డువేసి రక్షణ ఏర్పాటు చేస్తారా అంటే అసలు ఆ శాఖ అధికారులే కనిపించని పరిస్థితి.

మామూళ్లతో పర్యవేక్షణ గాలికి

కరకట్ట పటిష్ఠత విషయంలో పర్యవేక్షించాల్సిన ఆర్సీ అధికారులు ఆ బాధ్యతలను గాలికొదిలేశారు. బ్రిటీష్ హయాంలో కరకట్టపైకి మనిషి కూడా వెళ్లడానికి వీలులేనంత కట్టుదిట్టమైన నిబంధనలు అమలు చేశారు. అయితే ఇప్పుడు ఏకంగా కట్టనే తవ్వుకుపోతున్నా పట్టించుకునే వారే లేరు. ఆర్సీ విభాగానికి సంబంధించి ప్రస్తుతం ఏఈలు కాదుకదా కనీసం వారి సహాయకులు కూడా కనిపించరు. పెనుమూడి దిగువన రొయ్యల చెరువులు, మట్టి తవ్వకందారుల దగ్గర మామూళ్ల వసూలు చేసుకోవడానికి అధికారులు పరిమితమవుతున్నారు. గత వైసీపీ హయాంలో ఇసుక దందాకు అడ్డు రాకుండా చేసేందుకు నదీపరివాహక ప్రాంతంపై అజమాయిషీ ఉండాల్సిన ఆ శాఖనే నిర్వీర్యం చేశారు. వైసీపీ సర్కారు పోయి, కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారు గాడిన పడలేదు. రేపల్లె మండలంలో కరకట్ట పరిస్థితి ఎలా ఉంది? ఎక్కడెక్కడ మరమ్మతులు చెయ్యాలనేది తెలుసుకునేందుకు ఆర్సీ అధికారుల కోసం తహసీల్దారు, ఇతర శాఖల అధికారులు ప్రయత్నిస్తే ఎవరూ అందుబాటులో లేని పరిస్థితి.

ముగిసిన జిల్లా స్థాయి కూడో క్రీడాపోటీలు


బాపట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ ఆడిటోరియంలో జరుగుతున్న జిల్లా స్థాయి కూడో ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంధ్ర సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర కూడో అసోసియేషన్ అధ్యక్షుడు ఆలూరి శశిధర్, సెక్రటరి రవిబాబు, కోశాధికారి అనురాధ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీలకు వైజాగ్ నుంచి రాష్ట్ర కూడో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రమణ పరిశీలకునిగా విచ్చేశారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు బాలరామకోటిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడే కిషోర్, జిల్లా కార్యదర్శి తేజ, మాజీ సైనిక సంక్షేమ సంఘం బాపట్ల అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, కార్యదర్శి షేక్ మొహిద్దీన్, శంకర శేషగిరిరావు, టి.రుక్మధరావు, అడే రాఘవదేవి, అమ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కూడో శిక్షకులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆక్రమణల తొలగింపు సాధ్యమేనా?

- హైకోర్టు ఉత్తర్వులతో అధికారుల ఉలికిపాటు
- ఊరచెరువులోని ఎన్టీఆర్ కాలనీవాసులకు నోటీసులు



ఆక్రమణలు పోను మిగిలిన ఊరచెరువు



అద్దంకి ఊరచెరువులో నిర్మాణాలు జరిగిన ఎన్‌టీఆర్ నగర్

అద్దంకి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల నుంచి అద్దంకి పట్టణంలో అంతర్గంగా ఉన్న ఊరచెరువు ఆక్రమణలకు గురైంది. ఇక్కడ ప్రస్తుతం ఎన్టీఆర్ కాలనీ కూడా వెలిసింది. ప్రస్తుతం 20 వ వార్డు పరిధిలో ఉన్న ఎన్‌టీఆర్ నగర్‌లో సుమారు 500 కు పైగా పేద, మధ్య తరగతి కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే ఈ ఊరచెరువు రక్షణపై హైకోర్టు స్పందించి ఆక్రమణలను తొలగించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో చెరువులో ఇళ్లు నిర్మించుకుని ఉన్న కుటుంబాలను ఖాళీ చేయించడం అధికారులకు సవాల్‌గా మారింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే ఇబ్బందులు వస్తాయని అధికారులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి లో లక్ష్మీనరసింహస్వామి వారి తెప్పోత్సవం గతంలో ఉరచెరువులోనే నిర్వహించేవారని పెద్దలు చెప్తుంటారు. అంతటి వైభవం ఉన్న ఊరచెరువు ప్రస్తుతం ఉనికిని కోల్పోయింది. ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలోని 95 సర్వే నెంబర్ లో 121.50 ఎకరాలలో ఊరచెరువులో నాలుగు దశాబ్దాల నుంచి ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. ఇలా చెరువుకు సంబంధించిన 50 ఎకరాల్లో ఎన్‌టీఆర్ నగర్ విస్తరించింది. ప్రభుత్వ పరంగా ఇక్కడ నివసించే వారి కోసం మౌలిక వసతుల కల్పన కూడా జరిగింది. పలు గృహాలకు మున్సిపాలిటీ పన్నులు కూడా కట్టించుకుంటున్నది. కొందరికి ఇళ్ల స్థలాల పట్టాలను కూడా అధికారులు మంజూరు చేశారు. లైలా తుఫాన్ సమయంలో ఎన్‌టీఆర్‌నగర్ పూర్తిగా ముంపునకు గురైంది. అయినా ఆక్రమణలు ఆగలేదు. మొక్కుబడి చర్యలు మినహా అధికారులు పెద్దగా స్పందించలేదు. ఊరచెరువుకు నీరు చేరే వాగులను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేశారు. దీంతో ఊరచెరువు ఉనికి కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో దామావారిపాలేనికి చెందిన కొందరు రైతులు ఊరచెరువులో ఆక్రమణలపై హైకోర్టును ఆశ్రయించారు. ఆక్రమణల తొలగింపుపై రెండేళ్ల క్రితం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు తిరిగి హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. దీంతో ఆక్రమణలు తొలగించమని ఇటీవల హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఉలికిపాటుకు గురయ్యారు. చెరువులో నివాసం ఉంటున్న కుటుంబాలకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్లను ఖాళీ చేయాల్సి రావడంతో కాలనీవాసులను కలవరపాటుకు గురిచేసింది. ఈ పరిస్థితుల్లో అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సి ఉంది.

అమ్మవారికి గాజుల అలంకారం



శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని 25 వేల గాజులతో అలంకరించారు. రంగు రంగుల గాజులతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

-అద్దంకి, ఆంధ్రజ్యోతి



గుంటూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

యాప్‌ల మోత.. రికార్డుల భారం.. పనిచేయని మొబైల్స్‌తో విధుల నిర్వహణపై అంగన్వాడీలు బెంబేలెత్తిపోతున్నారు. అమ్మో అంగన్వాడీ ఉద్యోగమా అంటూ పలువురు విముఖత చూపుతున్నారు. తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో ఉద్యోగమంటేనే భయపడే పరిస్థితి అంగన్వాడీల్లో నెలకొంది. తాము పనిచేయలేమంటూ ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల మొబైల్ ఫోన్లను అధికారులకు పలువురు సరండర్ చేశారు.

- యాప్‌లు, రికార్డుల నిర్వహణతో బెంబేలు
- లక్ష్యాలకు దూరంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ
- రికార్డుల నిర్వహణ రద్దు జీవో వచ్చినా తప్పని భారం
- పనిచేయని ఫోన్లతో సతమతం.. అధికారులకు సరెండర్



వేమూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమంలో అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమైనది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 5,295 కేంద్రాల ద్వారా 3 లక్షలమంది గర్భిణులు, బాలింతలు, లక్షన్నర మంది చిన్నారులకు పోషణ అందించడంతోపాటు, వారి సంక్షేమం విషయంలో అంగన్వాడీలది కీలకపాత్ర. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు బలవర్ధక ఆహారాన్ని అందించడంతోపాటు, చిన్నారులకు ప్రీ స్కూలు విద్యను కూడా వీరు (మిగతా 6లో)

పనిచేయని ఫోన్లు.. తలనొప్పిగా యాప్‌లు

అంగన్వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లను నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్లో ప్రతి రోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నమోదు చేయాలి. వీటితోపాటు నెలకు రెండు సార్లు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేయాలి. నెలకు ఒకసారి మిల్క్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. అయితే సరుకులన్నీ ఒకేసారి రాకపోవడంతో వాటిని వేరు వేరు సమయాల్లో యాప్‌లో నమోదు చేయాల్సి వస్తోంది. టేక్ హోమ్ కిట్లలో ఇచ్చే సరుకులు మొత్తం ఒకేసారి రాకపోవడంతో గర్భిణులు, బాలింతలు పలుమార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనికితోడు ఎప్పుడో పాతకాలం నుంచి వాడుతున్న మొబైల్స్ పనిచేయకపోవడం, యాప్‌లకు సపోర్టు చేయకపోవడం వంటి కారణంగా యాప్‌ల నిర్వహణ పెద్ద తలనొప్పిగా మారింది. ఆ కారణంగా లబ్ధిదారులు ఒకటికి పది సార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొందరైతే వదిలేసుకుంటున్నారు. అలా వారి విరాలు నమోదు కాక పోతే మరుసటి నెల నుంచి సరుకుల సరఫరా ఆగిపో తోంది. ఆ కారణంగా మరుసటి నెల సరుకుల కొరత వచ్చి లబ్ధిదారుల ఆగ్రహానికి అంగన్వాడీలు గురవుతున్నారు. చివరకు లబ్ధిదారుల ఆగ్రహావేశాలతో ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారు.



మట్టి పరీక్షలు మమ

- భూసార పరీక్షలపై నిర్లక్ష్యం
- పరీక్షల లక్ష్యం 60,100.. పూర్తి 31,598
- భూ ఆరోగ్య కార్డుల పంపిణీ అరకొరగానే

(చీరాల, ఆంధ్రజ్యోతి) రైతులకు ఎంతో ఉపయోగపడే.. భూసారం తెలియజేసే.. పంటల సాగుకు సద్వినియోగమయ్యే.. దిగుబడులు పెంచే మట్టి పరీక్షలపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతుల పొలాల్లోని మట్టి సేకరించి పరీక్షలు చేసి భూసారాన్ని నిర్ధారించి రైతులకు భూ ఆరోగ్య కార్డులు ఇవ్వాలి. తదనుగుణంగా రైతులు పోషకాల వినియోగంతో పాటు ఏ పంటలు సాగు చేయాలో నిర్ధారించుకుంటారు. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వ్యవసాయశాఖ మట్టి పరీక్షల విషయంలో స్పందించడంలేదు. సిబ్బంది.. పరీక్షలకు అవసరమైన పరికరాల కొరత పేరుతో మట్టి సేకరణ.. పరీక్షల నిర్వహణ.. ఆరోగ్య కార్డుల పంపిణీ తూతూమంత్రంగా చేస్తోంది. పంటల సాగుకు ముందే అందించాల్సిన భూసార కార్డులు ముద్రణ స్థాయిలోనే ఉన్నాయంటే రైతులకు సంబంధించిన విషయాల్లో అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. పంట సాగు పూర్తయ్యేలోపైనా రైతులకు ఆరోగ్య కార్డులు అందించే పరిస్థితులు కనిపించడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో గుర్తించి.. ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులకు వ్యవసాయశాఖ తెలియజేయాలి. ఇందుకు భూసార పరీక్షలు కీలకం. అయితే ఖరీఫ్ సాగు ప్రారంభమై వారాలు గడుస్తున్నా నేటికీ భూసార పరీక్షలు పూర్తి కాలేదంటే వీటిపై వ్యవసాయ శాఖకు ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మట్టి పరీక్షల లక్ష్యం 60,100 కాగా ఇప్పటికి 31,598 మట్టి నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన భూసార పత్రాలను అందించడంలో కూడా అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతోంది. సాగు ప్రారంభం కాక మునుపే రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే ఆచరణలో అది అమలుకు నోచుకోలేదు. సాధారణ విస్తీర్ణంలో ఇప్పటికే 50 శాతం పంటల సాగును రైతులు చేపట్టారు. వచ్చే నెలాఖరుకు ఖరీఫ్ సీజన్ కూడా ముగియనున్నది. రబీకైనా సదరు పత్రాలు అందుతాయన్న నమ్మకం రైతులకు కలగడంలేదు.



ముద్రణలోనే కార్డులు

పల్నాడు జిల్లాలో 23,437 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా 23,043 సేకరించారు. వీటిలో 14,077 నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో లక్ష్యం మేర 13,862 మట్టి నమూనాలను సేకరించినా 7,455 పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 22,801 నమూనాలను సేకరించగా 10,066 పరీక్షలు పూర్తయ్యాయి. ఆయా కార్డుల పంపిణీ ముద్రణ స్థాయిలోనే ఉంది.

అవీ.. ఇవీ


ఏబీసీ వంతెన వద్ద ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న డైవర్షన్ రోడ్డు

ఏబీసీ వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు తొలగింపు

● రాకపోకలు లేక వాహనదారుల ఆగ్రహం

బల్లికురవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కాలువపై వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. చిన్న చిన్న వాహనాలు వెళ్లేలా డైవర్షన్ రోడ్డును పనుల వద్ద ఏర్పాటు చేశారు. దీంతో బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆదివారం ప్రజలకు ఎలాంటి సమాచారం తెలియజేయకుండానే డైవర్షన్ వేసిన రోడ్డును తొలగించారు. దీంతో రోజు మాదిరిగా ఈ రోడ్డులో వచ్చిన ప్రజలు రోడ్డు లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో వచ్చే కొత్త వ్యక్తులు వంతెన వద్దకు వచ్చి తిరిగి వెనక్కి వెళ్లాల్సి వచ్చిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆదివారం పలు శుభకార్యాలు ఉండటంతో ప్రజలు ఏబీసీ వంతెన వద్దకు వచ్చి రాకపోకలు లేకపోవటంతో ఉసూరుమంటూ వెళ్లారు.


అద్దంకి పట్టణం నాగులపాడు రోడ్డులోని ఓ వీధిలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

వీధి శునకాలతో ప్రజల బెంబేలు

అద్దంకి,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో వీధి శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై ఎగబడుతున్నాయి. దీంతో వీధులలో వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తె పరిస్థితి నెలకొంది. వీధి కుక్కల నియంత్రణ పై మున్సిపల్ అధికారులు మొక్కుబడి చర్యలు మాత్రమే తీసుకుంటుండటంతో అవి మరింత పెరిగి పోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. సంతానోత్పత్తి లేకుండా ఆపరేషన్‌లు చేయించే విధంగా చర్యలు చేపట్టే అవకాశం ఉన్నా మొక్కుబడిగా మాత్రమే చర్యలు చేపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కో వీధిలో పదుల సంఖ్యలో వీధి కుక్కలు ఉండటంతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో మరింత భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం

● భారీగా తరలి వచ్చిన భక్తులు

పంగులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చిలుకూరివారి వంశదేవర శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం పంగులూరులో వైభవంగా జరిగింది. తెనాలికి చెందిన ప్రముఖ వేదపండితులు బ్రహ్మశ్రీ వేములశ్రీహరి పర్యవేక్షణలో వారి రుత్విక్‌ల బృందం నిర్ణీత ముహూర్తంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ గావించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారు సర్వాంగసుందరంగా రూపుదిద్దుకున్న నూతన ఆలయంలో కొలువుదీరారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొనేందుకు పంగులూరు,చినమల్లవరం, నక్కలపాలెం, నాగండ్ల, ఇంకొల్లు పరిసర ప్రాంతాలకు చెందిన చిలుకూరి వంశస్తులు, వారి ఆడపడుచులు, బంధుమిత్రులు వేలాదిగా తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. దాతలు సమకూర్చిన వెండికిరీటధారణలతో ప్రత్యేకాలంకరణలో శోభిల్లిన శ్రీభద్రకాళీ అమ్మవారిని, వీరభద్రస్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. దేవతామూర్తుల ప్రతిష్ఠాపన అనంతరం శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కన్నుల పండువగా జరిగిన స్వామి వారి శాంతి కల్యాణవేడుకలో చిలుకూరి వంశస్థులు సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు.


ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి


పోతురాజు శిల వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వేలాదిమందికి అన్నదానం

పంగులూరులో ఆదివారం జరిగిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన వేలాదిమంది భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటుచేసింది.

పాల్గొన్న మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గరటయ్య

చిలుకూరివారి వంశదేవర శ్రీభద్రకాళీసమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గరటయ్య, బాచిన చెంచు ప్రసాద్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


ఆలయశిఖరంపై కలశప్రతిష్ఠ చేస్తున్న వేదపండితులు

ప్రయాణికులు ఫుల్ బస్‌లు నిల్..!

● ఆదివారం రోజూ తీవ్ర రద్దీ

అద్దంకి,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రద్దీ బాగా పెరిగింది. అయితే అందుకు తగ్గట్లు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు లేకపోవటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పటం లేదు. ఆదివారం రోజు కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది.దీంతో సోమవారం నుంచి పరిస్థితి ఏలా ఉంటుందో అనే ఆందోళన ప్రయాణికులలో నెలకొంది. అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి అరకొర బస్సు సర్వీసులు మాత్రమే ఉండటంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఆదివారం వివాహాలు ఉండటంతో మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించారు. ప్రధాన రూట్లలో సైతం బస్సులు సరిపడా లేకపోవటం తో ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వచ్చిన బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు కుస్తీలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయటంతో రద్దీ మరింత పెరిగింది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు ఆర్టీసీ అధికారులు బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో నర్సరావుపేట బస్సు ఎక్కేందుకు గుమికూడిన ప్రయాణికులు


అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

శివాలయానికి శ్రీచక్రం బహూకరణ

ఇంకొల్లు,ఆగస్టు 17,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పాలేరు రామకృష్ణ దంపతులు శ్రీగంగాపార్వతి సమేత చెన్నమల్లేశ్వర స్వామి వారి ఆలయానికి పంచలోహాలతో తయారు చేసిన శ్రీచక్రంను బహూకరించారు. ఆదివారం ఆలయప్రాంగణంలో శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. కావలికి చెందిన వేదపండితులు కొండ కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్ర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయపూజారి సాంబశివరావు, దాత కుటుంబీకులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న రామకృష్ణ దంపతులు


నరసింహారావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు

నరసింహారావుకి టీడీపీ నేతల నివాళి

చినగంజాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు తండ్రి నరసింహారావు ఆదివారం మృతి చెందాడు. పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీనివాసరావు స్వగృహానికి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం ప్రతినిధులు కొమ్మినేని వెంకట్, బి.అఖిల్, టీడీ పీ నాయకులు సాంబయ్య, వల్లేరు మార్క్, వెంకటేశ్వర్లు, శివయ్య, అద్దూరి వెంకటేశ్వర్లు, రాచూరి కుమార్, దేవతోటి నాగరాజు, టి.చిన్నాలు నరసింహారావు పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావుని ఎమ్మెల్యే ఏలూరి ఫోన్లో పరామర్శించారు.

అమ్మో.. అంగన్వాడీ ఉద్యోగమా?

(5వ పేజీ తరువాయి)

అందించాలి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల కారణంగా వారికి పనిభారం పెరిగి మొత్తంగా వ్యవస్థ దెబ్బ తింటోంది. యాప్‌లు, రికార్డుల నిర్వహణ భారం కారణంగా ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించ లేకపోతున్నారు.

ఆరు రకాల రికార్డుల మోత

అంగన్వాడీ ఉద్యోగులపై రికార్డుల మోత అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారి విన్నపాన్ని మన్నించి రికార్డుల భారాన్ని తొలగిస్తూ జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఎవరూ ఫిజికల్ రికార్డులు నిర్వహించాల్సిన పనిలేదు. కానీ ఆరు రికార్డులు నిర్వహించాలని అధికారులు హుకుం జారీ చేశారు. ఫుడ్ కంజంప్షన్ రికార్డు(ఎఫ్‌సీఆర్), పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ పోషణ రికార్డు (ఎస్ఎన్‌పీ), ప్రతి రోజూ గర్భిణీ, బాలింతల రికార్డుతో పాటు ప్రతి నెలా మంత్లీ ప్రాజెక్టు రిపోర్టు(ఎంపీఆర్), అంగన్వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డుతో పాటు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ సహా మొత్తం ఆరు రకాల రికార్డులను ఉద్యోగులు నిర్వహించాల్సి వస్తోంది. ఫలితంగా విధుల్లో నాణ్యత తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో యాప్‌లు నిర్వహించలేమని మొబైల్స్ సరెండర్ చేసి ఉద్యోగులు నిరసన తెలి పారు. అధికారుల సర్దుబాటుతో ఆ విషయం అంతటితో ఆగింది. తక్షణ మే యాప్‌ల నిర్వహణకు తగిన ఫోన్లు ఇచ్చి, రికార్డుల నిర్వహణను నిలిపివేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో గ్రామదేవతలకు పొంగళ్లు

పంగులూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):శ్రావణ మాసం సందర్భంగా కొండమూరు, మప్పవరం గ్రామాలలో మహిళలు గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. ఆదివారం గ్రామంలోని మహిళలు గ్రామదేవతలైన పోలేరమ్మ, పోతురాజులకు మొక్కులు చెల్లించుకునే కార్యక్రమంలో భాగంగా మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పొంగళ్ళు సమర్పించి పూజలు చేశారు.

కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

బల్లికురవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నర్సారావుపేట ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నుంచి కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఈనెల 21 వ తేదీన పల్లకి ఊరేగింపు కార్యక్రమంతో ముగింపు కార్యక్రమం చేపడతామని నిర్వాహకులు తెలిపారు. మెదటి రోజు మహిళా భక్తులు పూజా కార్యక్రమాలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

పర్చూరు, అగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో పర్చూరులోని ఎన్టీఆర్ క్రీడా వికాస స్టేడియంలో నిర్వహించిన మెన్స్ డబుల్ షటిల్ టోర్నమెంట్ పోటీలో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈపోటీలో ప్రథమ బహుమతి ప్రకాశం జిల్లా మార్కాపురం కైవసం చేసుకోగా, ద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులు చీరాల, చిన గంజాం, ఇంకొల్లు కైవసం చేసుకున్నాయి. ప్రథమ బహుమతి రూ.10 వేల రూపాయలను తెలుగుదేశం పార్టీ యువనేత చెరుకూరి చింపయ్య(శ్రీధర్) అందజేశారు.

పీఏసీఎస్ సభ్యుల ప్రమాణ స్వీకారం

కారంచేడు మండలం కొడవలివారిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్, డైరెక్టర్లుగా కొసరాజు సునీల్, కొడలి శ్రీనివాస్, నల్లూరి శ్రీనివాసరావులు ఆదివారం కొత్తగోర్ల శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా పాలక వర్గ సభ్యులు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


విద్యార్థులతో పీ-4 మార్గదర్శి విక్రం నారాయణరావు

పేద విద్యార్థులతో పీ4 తొలి మార్గదర్శి మమేకం

● వారితో కలిసి సహపంక్తి భోజనం

చినగంజాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామానికి చెందిన పేద విద్యార్థులతో పీ-4 మొదటి మార్గదర్శి లాయిడ్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ విక్రం నారాయణరావు ఆదివారం మమేకయ్యారు. గొనసపూడి గ్రామంలోని తన స్వగృహానికి విద్యార్థులను పిలిపించుకొని వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామం వచ్చిన సందర్భంగా రాష్ట్రంలోని మొట్టమొదటి మార్గదర్శిగా విక్రం నారాయణరావుని ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి సమక్షంలోనే ఆయన గ్రామంలోని 15 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న 15 కుటుంబాలలో ఉన్న ఆరుగురు విద్యార్థులు ఎల్లావుల గణేష్, మద్దిన నాగార్జున, కిలారి దివ్య, ఎల్లావుల సుధీర్, ఎల్లావుల ప్రభాకర్, గోనె హేమలతలతో ఆయన మాట్లాడారు. వారి యోగక్షేమాలతోపాటు వారు ఏ తరగతి చదువుతున్నది, ఏ పాఠశాలలో చదువుతున్నారు, విద్యా విధానం, కుటుంబ ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల పాఠశాల ఫీజులు ఆయనే చెల్లిస్తున్నారు. ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, టీడీపీ నాయకులు కొండ్రగుంట శ్రీహరి, దివ్వకోలు రాము, వెంకటరావు, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కే శారద తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో గుర్తింపు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణిస్తున్న యువత ఆధారంగా ఆయా ప్రాంతాల కీర్తి ప్రసిద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే కొండయ్య బహుమతులు అందజేశారు. అలాగే పందిళ్లపల్లి గ్రామంలోని పందిళ్లమ్మతల్లి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మ ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, ఏఎంసీ ఛైర్మన్ జనార్ధనరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ లైన్లతో సరఫరాకు అంతరాయం

బల్లికురవ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయిదు రోజుల పాటు ప్రత్యేక విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు చేస్తున్నామని, దీని వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం నుంచి నూతన విద్యుత్ లైన్ పనులు ప్రారంభం అయ్యాయని, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.


బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

జర్నలిస్టులకు ప్రజా ప్రభుత్వం అండ

● ఎమ్మెల్యే కొండయ్య


చీరాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, సమస్యలు ఎత్తి చూపి ప్రజల పక్షాన నిలిచేది పాత్రికేయులేనని ఏపీయూడబ్ల్యూజే 69వ వార్షికోత్సం ఆదివారం చీరాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏరియా వైద్యశాలలో గర్భిణులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. అనంతరం చైతన్య మనో వికాస కేంద్రంలో మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొండయ్య, మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు హాజరయ్యారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ జనార్దనరావు, పాత్రికేయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

● సాగులో అప్పులే కారణమని చెబుతున్న కుటుంబసభ్యులు

యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన యువకుడు కాకాని ఈస్టర్ బాబు (27) ఆదివారం చెట్టు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అందిన సమాచారం ప్రకారం బల్లికురవ మండలం వేమవరంలోని ఒక గ్రానైట్ పరిశ్రమలో ఈస్టర్‌బాబు సూపర్ వైజరుగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది వేమవరంలో 7, గన్నవరంలో 3 ఎకరాలను కౌలుకు తీసుకొని బర్లీ పొగాకును సాగు చేశాడు. పండించిన పొగాకులో కొంతభాగాన్ని అమ్ముకోగా, ఇంకా కొంత అమ్ముకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దాదాపుగా రూ. 7 లక్షలకు పైగా బాకీలు ఉన్నాయి. దీంతో అప్పులు తీర్చలేననే మనస్తాపంతో ఈస్టర్‌బాబు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఆత్మహత్యపై పూర్తి స్థాయిలో సమాచారం అందలేదని, గ్రామ వీఆర్వోను సమాచారం సేకరించాలని ఆదేశించినట్లు మండల తహసీల్దారు కె. రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ టి. రత్నకుమారి తెలిపారు. ఇదిలా ఉండగా మృతుని కుటుంబసభ్యులను టీడీపీ మండల నాయకులు నల్లపనేని రంగయ్యచౌదరి పరామర్శించారు.

'సోమశిల'లో 47.840 టీఎంసీలు



అనంతసాగరం ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 24,087 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో డ్యాంలో 47.840 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ కండలేరుకు 8, 150,వరద కాలువకు 1,850, ఉత్తర కాలువకు 340 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

23న ఒంగోలులో రాష్ట్ర మహాసభలు

- సర్వేపల్లిని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలి
- 'స్త్రీశక్తి' ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నాం..
- మహిళా ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23న ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహించను న్నామని, ఈ సభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని జెండావీధి షాదీ మంజిల్‌లో ఆదివారం సీపీఐ 26వ జిల్లా మహాసభ జరిగింది. జిల్లాకార్యదర్శి దామా అంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా



పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు జయప్రదం చేసే బాధ్యత పార్టీనేతలపై ఉందన్నారు. ఇందులో సూపర్‌సిక్స్ పథకాలపైనే ప్రధానంగా చర్చ ఉంటుందన్నారు. స్త్రీశక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఇది పూర్తిస్థాయిలో అమలు అయ్యేందుకు మరో మూడువేల బస్సులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో ఉన్న సర్వేపల్లిని గూడూరు జిల్లాలో కలపాలని ప్రభుత్వానికి నివేదికలు అందాయన్నారు. దీనివల్ల నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం వద్ద ఉండే పరిశ్రమలు కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందన్నారు. ఈ క్రమంలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలని ఆయన సూచించారు. జిల్లాకు చెందిన ఓ మహిళ ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే చేసిన వాఖ్యలు సరికాదన్నారు. సీపీఐ జాతీయ నాయకుడు, రైతు సంఘం జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోలార్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవాలని చూస్తున్నదని విమర్శించారు. భూసేకరణ జీవోను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీస్ మాట్లాడుతూ పీ 4 పథకం ద్వారా పేదరికాన్ని నివారించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. అంతకు ముందు నగరంలోని మహబూబ్‌ఖాన్ పార్కు నుంచి షాదీమంజిల్ వరకు కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, పార్టీ నేతలు పముజుల దశరథరామయ్య, రామరాజు, మాలకొండయ్య, అరిగెల సాయి, సయ్యద్ సిరాజ్, మధు, నందిపోగు రమణయ్య, నాగరాజు, షాన్‌వాజ్, వినోదమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు జెండావీధి షాదీమంజిల్ జరిగిన సీపీఐ జిల్లా మహాసభకు హాజరైన ప్రతినిధులు

పేలిన పోలీసు తుపాకీ



- గంజాయి స్మగ్లర్‌ను పట్టుకునే క్రమంలో కాల్పులు
- సినీ ఫక్కీలో వెంబడించి కారు పట్టివేత
- వెంకటాచలం ఘటన మరవక ముందే.. తాజాగా మరో ఘటన
- లారీడ్రైవర్ అప్రమత్తంతో తప్పిన ప్రమాదం
- రోడ్డు, రైలు మార్గాల ద్వారా జిల్లాకు 'మత్తు' దిగుమతి
- ఉలిక్కిపడిన నగరం



గాయాలపాలైన ఈగల్ టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను పరామర్శిస్తున్న ఐజీ ఆర్‌కే రవికృష్ణ, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి స్మగ్లర్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. మొన్నటిమొన్న వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద గంజాయి తరలిస్తున్న కారును నిలిపి డీఎస్పీ తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో స్మగ్లర్లు కారు వేగాన్ని పెంచి దూసుకెళ్లారు. ఈ ఘటనలో డీఎస్పీతోపాటు పలువురు పోలీసులకు గాయాల య్యాయి. ఈ ఘటన మరువకముందే తాజాగా నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానం వద్ద జాతీయరహదారిపై గంజాయి స్మగ్లర్ కారును చుట్టుముట్టిన పోలీసులను ఢీకొని పరారయ్యేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఈగల్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. స్మగ్లర్లను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులను వాహనాలతో ఢీకొట్టే స్థాయికి వారు వచ్చారంటే జిల్లాలో గంజాయి రవాణా ఏస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

కానిస్టేబుల్‌ను ఢీకొట్టి...

చెన్నై వైపునకు ఓ కారులో గంజాయిని తీసుకువస్తున్నారన్న సమాచారం ఎస్పీ జీ. కృష్ణకాంత్‌కు అందింది. దీంతో ఆయన బాలాజీనగర్ పోలీసులను, ఈగల్‌సెల్‌ను అప్రమత్తం చేశారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కే. సాంబశివరావు తన సిబ్బంది, ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌తో కలిసి ఆదివారం తెల్లవారుజామున జాతీయరహదారిపై నిఘా ఏర్పాటు చేశారు. పెన్నాబ్రిడ్జికి ముందు కాపు కాసిన పోలీసులు కారును వెంబడించారు. కారు జాతీయరహదారి నుంచి ఎస్వీజీఎస్ కళాశాల వద్ద యూటర్న్ తీసుకొని అక్కడున్న ఇద్దరు వ్యక్తులకు గంజాయి ఇచ్చేందుకు నిందితుడు కారుని స్లో చేశాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే కారును చుట్టుముట్టారు. దీంతో గంజాయిని తీసుకునేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. నిందితుడు తప్పించుకునే క్రమంలో పోలీసులను ఢీ కొట్టి, కారును వెనుకకు వేగంగా రివర్స్ తీసి ముందుకు దూసుకెళ్లాడు. కారు వెనుక ఉన్న ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను ఢీకొనడంతో ఆయన ఎగిరి జాతీయరహదారిపై పడ్డారు. అదే సమయంలో ఓ లారీ వేగంగా కానిస్టేబుల్ పైకి వచ్చింది. అయితే డ్రైవర్ అప్రమత్తమై షడన్ బ్రేకులు వేయడంతో కానిస్టేబుల్‌కి స్వల్పగాయాలయ్యాయి. మిగిలిన పోలీసులు తప్పించుకున్నారు. అప్రమత్తమైన బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు స్మగ్లర్ కారును వెంబడిస్తూ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. అయినా నిందితుడు ఎన్టీఆర్ నగర్‌లోకి దూసుకెళ్లి కారును వదిలి పరుగులు తీస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

ఉలిక్కిపడిన నెల్లూరు నగరం

జిల్లాలో గతంలో ఎప్పుడో గన్‌తో కాల్పులు జరిపి ఎన్‌కౌంటర్ చేశారు. చిన్నబజారు పోలీసు స్టేషన్ వద్ద జరిగిన అల్లర్లలో ఎస్పీని కాపాడే ప్రయత్నంలో గన్‌మన్ గాల్లో కాల్పులు జరిపాడని విన్నాం. అయితే ఎన్నో ఏళ్ల తరువాత మళ్లీ ఇప్పుడు పోలీసు గన్ గంజాయి స్మగ్లర్‌ను పట్టుకునే క్రమంలో రెండు రౌండ్లు పేలింది. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ తన గన్‌తో రెండు రౌండ్లు స్మగ్లర్ కారుపై కాల్చారు. ఆదివారం కావడంతో ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో యువత క్రికెట్ ఆడుతుండటం, పెద్దలు వాకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో కాల్పులు జరగడంతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

రోడ్డు, రైలు మార్గాల్లో గంజాయి రవాణా

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా రోజురోజుకు పెరిగిపోతోంది. రోడ్డు, రైళ్ల మార్గాల ద్వారా నెల్లూరుకి భారీగా గంజాయి దిగుమతి అవుతున్నది. ఒడిస్సా, మన్యం, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, జిల్లాలోని గంజాయి డీలర్లకు అధిక ధరకు అమ్ముతున్నారు. ఇటీవల ఆర్టీసీ బస్సులు, కార్లు, పలు రైళ్లలో వరుసగా గంజాయిని పోలీసులు పట్టుకుంటున్నా, అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు.



బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు జరిపిన కాల్పుల్లో పగిలిన కారు అద్దం

శెభాష్... పోలీస్!

- మంత్రి నారాయణ అభినందన

నెల్లూరు(క్రైం) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో గంజాయి అక్రమ రవాణాను అరికట్టే విషయంలో పోలీసుల పనితీరు అభినందనీయమని మున్సిపల్‌శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గంజాయి స్మగ్లర్ దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఈగల్ టీమ్ కానిస్టేబుల్ పటాన్ ఫిరోజ్ ఆరోగ్య పరిస్థితిపై నారాయణ ఆరా తీసి, ఆయనకు అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కారును వెంబడించి చాకచక్యంగా స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్న సీఐ సాంబశివరావును, కానిస్టేబుల్ ఫిరోజ్‌ను మంత్రి అభినందించారు. గంజాయి రవాణా, అమ్మకంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదన్నారు. ఈగల్ టీమ్ ద్వారా రాష్ట్రాన్ని గంజాయి, మాదకద్రవ్యాల రహితంగా మారుస్తున్నామన్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాల విషయంలో నిబంధనలను మరింత కఠినతరం చేయాలని ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు మంత్రి సూచించారు.

కరేడు మార్గాలన్నీ దిగ్బంధం

- ముందస్తుగా ఆందోళనకారుల అరెస్టులు
- భారీగా మోహరించిన పోలీసులు
- నేటి 'చలో కరేడు'ను అడ్డుకునేయత్నం

ఉలవపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు గ్రామ పంచాయతీలో ఇండోసోల్ కంపెనీ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా సోమవారం ప్రజాసంఘాలు, రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో చలో కరేడుకు పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రామంలో ఇప్పటికే పోలీసు 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎలాంటి సభలు, ప్రచారాలు నిర్వహించకూడదని ముందస్తు హెచ్చరికలు ఉన్నాయి. ఇందులో భాగంగా డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ బందోబస్తులో భాగంగా సుమారు 300 మంది పోలీసులను, స్పెషల్ బెటాలియన్‌ను ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కరేడు గ్రామానికి వెళ్లే అన్ని మార్గాల్లోనూ బారికేడ్లు సిద్ధం చేశారు. ఒంగోలు, కావలి వైపు నుంచి వచ్చే మార్గాల్లో టోల్‌గేట్లు వద్ద ప్రజాసంఘాల నాయకులు, రైతుకూలి సంఘం నేతలను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులను ఏర్పాటు చేశారు. కరేడుకు వెళ్లే అలగాయపాలెం రోడ్డు, రామకృష్ణాపురం రోడ్డు, ఉలవపాడు నుంచి వెళ్లే రోడ్లలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళనకారులు సముద్ర మార్గాన వచ్చే అవకాశం ఉందని(గతంలో రామచంద్ర యాదవ్ పెద్దపల్లెపాలెం నుంచి సముద్ర మార్గం నుంచి హైవే దిగ్బంధంలో పాల్గొన్న విషయం తెలిసిందే) అక్కడా నిఘా ఏర్పాటు చేశారు.



కరేడు వెళ్లే మార్గంలో ఉలవపాడు దర్గా సెంటర్ వద్ద బారికేడ్లు

నేతల ముందస్తు అరెస్టులు

చలో కరేడు ఉద్యమానికి పిలుపు ఇచ్చిన సీపీఎం నాయకులు కుమార్‌ని ముందస్తుగా ఆదివారం పోలీసులు అరెస్టు చేసి, కందుకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు, మరోనేత జాన్‌ను అదుపులోకి తీసుకొని సింగరాయకొండ సీఐటీయూ కార్యాలయంలో నిర్బంధించారు. ఈ క్రమంలో సోమవారం నిర్వహించే చలో కరేడు కార్యక్రమంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

భలే మంచి

బెల్టు బేరం

- జోరుగా బహిరంగ వేలం
- మొన్న అంకభూపాలపురం, నిన్న అయ్యవారిపల్లె, నేడు బంగారక్కపాలెం... రేపు ఎక్కడో మరి...?
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వలేటివారిపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వలేటివారి పాలెం మండలంలో మద్యం బెల్టుషాపులకు బహిరంగ వేలం కొనసాగుతూనే ఉంది. మొన్న అంకభూపాలపురం... నిన్న అయ్యవారిపల్లె... నేడు బంగారక్కపాలెం... రేపు మరో గ్రామంలో వీటి వేలం నిర్వహణకు గ్రామస్థులు సమాయత్తమవుతున్నారు. అయితే ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఆరు నెలల క్రితం అంకభూపాలపురంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెల్టుషాపును వేలం ద్వారా రూ. 1.50 లక్షలకు దక్కించుకున్నాడు. నాలుగు నెలల క్రితం అయ్యవారిపల్లెలో ఆ గ్రామానికి చెందిన వ్యక్తి రూ. 9.50 లక్షలకు బెల్టుషాపును వేలం ద్వారా పాడుకున్నాడు. రెండు రోజుల క్రితం బంగారక్కపాలెంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి రూ. 3.02లక్షలకు బెల్టుపాపును వేలం ద్వారా దక్కించుకున్నాడు.

గ్రామాల్లో బెల్టుకు డిమాండ్

గ్రామాల్లో బెల్టుషాపులకు ఉన్న డిమాండ్‌ను గుర్తించిన గ్రామస్థులు కొందరు గ్రామ పంచాయతీ పాలకవర్గాలతో కలిసి దండోరా వేయించి, బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. మండలంలో పోకూరు, వలేటివారి పాలెం, కళవల్ల గ్రామాల్లో మాత్రమే లైసెన్స్ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవికాక ప్రతీ గ్రామంలో ఐదారు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. తమ గ్రామాల్లోనే మద్యం అందుబాటులో ఉండడంతో మద్యం ప్రియులు ఎక్కువ ధర అయినా బెల్టుపాపుల్లోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో పోటీపడి బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామస్థులు పంచాయతీ పాలకవర్గాలతో సంప్రదించి, బెల్టుషాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. వేలంలో చెల్లించే నగదు ఆధారంగా రెండేళ్ల వరకు బెల్టుషాపు నిర్వహించుకునే హక్కును కట్టబెడుతున్నారు. వేలంలో బెల్టుషాపు దక్కించుకున్న వ్యక్తి తప్ప ఇతరులెవ రూ మద్యం విక్రయించరాదు. ఒకవేళ ఎవరైనా రహస్యంగా మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధించాలని నిర్ణయించారు.

దాడులతో సంబంధం లేదు..

బెల్టుషాపులపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తే, తమకెలాంటి సంబంధం లేదని వేలంలో షరతు విధిస్తారు. అందుకు అంగీకరించి పాటదారులు వేలం పాడుకుంటున్నారు. ఎలాంటి చట్టబద్ధత లేని బెల్టుషాపులకు గ్రామ పంచాయతీల పాలక వర్గాలు సంపూర్ణ సహకారం ఉంటోంది. బెల్టుషాపులు కొనసాగించడం చట్టవిరుద్ధమని నిబంధనలు ఉన్నా, ఇంతవరకు అధికారులు నుంచి ఎలాంటి స్పందన లేదు.

మరికొన్నిచోట్ల నిర్వహణకు కసరత్తు

మండలంలోని మరికొన్ని గ్రామాల్లో బెల్టుషాపుల వేలం నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. బెల్టుషాపులకు బహిరంగ వేలం వేస్తే ఉన్నతాధికారులు దృష్టికి వస్తుందనే ఉద్దేశ్యంతో బెల్టుషాపులు వేలాన్ని రహస్యంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఎవరికో ఒకరికి బెల్టుషాపు హక్కును కల్పించి, ఎంతోకొంత చేజిక్కించుకోవాలని కొందరు నేతలు ప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నారు. వేలం నిర్వహణకు ముందుగానే వచ్చే డబ్బుల్లో ఎవరి వాటా ఎంతెంత అనేది నిర్ణయించుకున్న తరువాతే వేలానికి ముహూర్తం ఖరారు చేస్తున్నారు. గ్రామాల్లో 'బెల్టు' వద్దని మహిళల నుంచి డిమాండ్ వ్యక్తం అవుతున్నా, ఎక్సైజ్ అధికారుల నుంచి స్పందన కరువైంది. బెల్టుషాపులు లేవని చెప్పే ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బెల్టుషాపుల వేలంపై ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

నాలుగు సచివాలయాలకు ఒక్కరే !

- ఉద్యానవన సహాయకుల కొరత
- గతేడాది క్రాప్ బుకింగ్ సరిగా చేయలేదని సిబ్బంది కుదింపు
- రైతుల ఇబ్బందులు

7లో..

'ఎంత ఖర్చయినా సరే.. డ్రైవర్‌ను పనిలో నుంచి తీసేయండి' ఇది ఓ సినిమాలోని ఫేమస్ డైలాగ్. హీరో తన అవసరం కోసం డ్రైవర్‌ను పనిలో నుంచి తొలగించేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తాడు. ఇప్పుడు జిల్లాలోని గృహనిర్మాణశాఖలో కూడా ఇదే సీన్ కనిపిస్తోంది. 'ఎంత ఖర్చయినా పర్వాలేదు.. ఆ అధికారులను పంపేయండి' అంటూ అక్రమార్కులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పేదల సొమ్మును దోచుకుంటుంటే అడ్డు తగులుతున్న అధికారులను జిల్లా నుంచి ఎలాగైనా తరిమేయాలంటూ నేతల చుట్టూ తిరుగుతున్నారు. రూ.లక్షలు ఆశచూపుతూ నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న అధికారులపై కుట్రలు చేస్తున్నారు. కొందరు అవినీతి అధికారులు కూడా వీరికి సహకరిస్తుండడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

బరితెగింపు!

- గృహనిర్మాణ శాఖలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- వారిని అడ్డుకుంటున్న కొందరు అధికారులు
- అడ్డుచెప్పేవారిని జిల్లా నుంచి పంపేయత్నం
- కావలిలో సక్సెస్, ఇప్పుడు నెల్లూరులో కుట్ర ?
- నేతల చుట్టూ కాంట్రాక్టర్లు, అధికారుల ప్రదక్షిణలు
- అవినీతిపరులపై చర్యలు తీసుకోకుండా డ్రామాలు



టీపీ గూడూరు మండలం వరిగొండ గిరిజన కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే సోమిరెడ్డి(ఫైల్)

గత ప్రభుత్వంలో దోచుకున్న పేదల సొమ్మును ఇప్పుడు బయటకు తీస్తూ మళ్లీ దోపిడీకి స్కెచ్ వేసినట్లు ప్రచారం జరుగుతోంది. నాలుగునెలల క్రితం సాక్షాత్తూ హౌసింగ్ మంత్రినే జిల్లాలో పర్యటించి పేదల ఇళ్ల నిర్మాణాలను చూసి ఆశ్చర్యపోయారు. ఇంత బరితెగింపు ఎక్కడా చూడలేదంటూ వ్యాఖ్యానిస్తూనే అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అయితే ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోగా, పైగా గత ప్రభుత్వంలో దోపిడీ చేసినవారే మళ్లీ హౌసింగ్‌లో చక్రం తిప్పుతుంటుండడం గమనార్హం.

నిన్న కావలి.. నేడు నెల్లూరు ?

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణంలో దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అందరికీ తెలుసు. చాలాచోట్ల ఇళ్లు నిర్మించకుండానే నిర్మించినట్లుగా బిల్లులు, సిమెంటు, స్టీలు దోపిడీ చేయడం ఒక ఎత్తయితే, కట్టిన ఇళ్లు కూడా అత్యంత నాసిరకంగా నిర్మించడం మరో ఎత్తు. స్వయాన హౌసింగ్ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి టీపీ గూడూరు మండలం వరిగొండ గిరిజనకాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఆశ్చర్యపోయారు. వారు కాళ్లతో తన్నగానే పునాదులు కదిలిపోయాయి. దీన్ని బట్టి ఇళ్ల నిర్మాణం ఎంత నాసిరకంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా మొత్తం ఇదే పరిస్థితి. ఏ కాలనీకి వెళ్లి చూసినా పగిలిపోయిన ఇళ్లే దర్శనమిస్తు న్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విజిలె న్స్ విచారణ జరగ్గా, అనేక అక్రమాలు బట్టబయ లయ్యాయి. ఇళ్ల నిర్మాణంపై అనేక ఆరోపణలు రావడంతో ఏడాది పాటు కలుగులో దాక్కున్న దొంగ లంతా ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటకొస్తూ మళ్లీ పాత పాట అందుకుంటున్నారు. చాలా చోట్ల సిమెంటు, స్టీలు మాయమైంది. కొన్ని చోట్ల బిల్లులు లాగేసుకున్నారు. ఇప్పుడు ఆ అక్రమాలన్నింటినీ సక్రమం చేసుకునేందుకు లబ్ధిదారులకు తెలియకుండానే వారికి సిమెంటు, స్టీలు ఇచ్చినట్లు రికార్డులు సరిచేసే ప్రయత్నాలు చేస్తున్నారు. దీన్ని కావలిలో పనిచేసే ఈఈ అడ్డుకోవడంతో ఇటీవల ఆయన్ను అక్కడి నుంచి బదిలీ చేశారన్న ఆరోపణలున్నాయి. అక్కడ ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చక్రం తిప్పుతున్నట్లు గృహనిర్మాణశాఖలో చర్చించు కుంటున్నారు. నెల్లూరు డివిజన్‌లో కూడా ఇదే తరహాలో దొంగ వ్యవహారాలు చేసేందుకు కొందరు అక్రమార్కులు ప్రయత్నిస్తుండగా, అక్కడ పనిచేసే ఓ అధికారి అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఆయన్ను కూడా బదిలీ చేయించేందుకు తెరవెనుక ఆర్థికబలం ప్రయోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్ విచారణలో బట్టబయలు

నాడు హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పేదల సొమ్ములను తినేసినట్లు తేలింది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే సుమారు రూ.110 కోట్ల మేర అవినీతి జరిగినట్లు విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఇందుకు అప్పట్లో పనిచేసిన ఏఈ నుంచి పీడీ వరకూ ప్రతీ ఒక్కరికీ పాత్ర ఉందంటూ నిర్ధారించారు. ఇదే విషయంపై జిల్లా స్థాయి సమీక్షలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. అక్రమార్కులకు పాల్పడిన, వారికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజల సొమ్మును రికవరీ చేయాలని సమీక్షలో నిర్ణయించారు. అయితే ఆ తర్వాత నలుగురైదుగురిని సస్పెండ్ చేసి హౌసింగ్ ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు. ఇంకా అనేకమందికి సంబంధించిన ఫైళ్లను తొక్కిపెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఒక్క కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పైగా ఇదే కాంట్రాక్టర్లకు మళ్లీ బిల్లులు ఇప్పించేందుకు వేగంగా ఫైళ్లు కదులుతున్నట్లు తెలుస్తోంది.

నేడు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పర్యటన

అల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పలు ఆలయాల పాలక మండలి ఎంపికల్లో పాల్గొనేందుకు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సోమవారం అల్లూరు మండలంలో పర్యటించనున్నారు. నార్తుమోపూరు రామాలయం, శివాలయం, వరదరాజస్వామి ఆలయం, ఇందుపూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ఎంపిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు నార్తుమోపూరులో, అనంతరం ఇందుపూరులో పర్యటిస్తారని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

కావలి,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం 8వ వార్డుకు చెందిన క్యాన్సర్ బాధితుడు జలదంకి శివకుమార్‌కు ఆదివారం ఆర్యవైశ్య ప్రముఖులు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షుడు అమరా వేదగిరి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ప్రముఖులు, మిత్రుల నుంచి రూ. 45 వేలు సేకరించారు. వాటిని అందచేయటానికి ఆర్యవైశ్యసంఘం కావలి అధ్యక్షుడు తటవర్తి రమేష్‌ను ఆహ్వానించటంతో ఆయన మరో రూ.5 వేలు ఇవ్వటంతో మొత్తం రూ. 50 వేలు శివకుమార్ ఇంటికి వెళ్లి అందచేశారు.

పంచాయతీరాజ్ ఉద్యోగికి సన్మానం

కావలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణానికి చెందిన చింతాల భాస్కరరావు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సాంకేతిక విభాగంలో పనిచేసి పదవీ విరమణ చేయడంతో ఆదివారం కావలి పట్టణ కల్యాణ మండపంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. అలాగే పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులు తదితరులు ఆయనను సన్మానించారు.

పోలేరమ్మకు పొంగళ్లు

కొండాపురం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీలోని వెల్లటూరివారిపాలెంలో ఉన్న పోలేరమ్మకు భక్తులు ఆదివారం పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలోని మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలెం, ఇస్కపాలెం గ్రామాల భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్లుపెట్టి పూజలు చేశారు.

శ్రీహరికోట తీరంలో

బోటు కలకలం

- బోగోలు మండలం జువ్వలదిన్నె వాసిగా గుర్తింపు
- విచారణానంతరం పంపేసిన పోలీసులు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట సముద్ర తీరం ఒడ్డున ఓ పడవ ప్రత్యక్షమవడంతో కలకలం రేగింది. శ్రీహరికోట పోలీసుల సమాచారం మేరకు.. ఆదివారం తెల్లవారుజామున షార్‌లోని సముద్ర ఒడ్డున పడవతో ఓ వ్యక్తి తిరుగుతుండడంతో బందోబస్తులో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. బోటుతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం శ్రీహరికోట పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో.. అతడు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసులు అనే మత్స్యకారుడని తేలింది. చెన్నై వెళ్లి సముద్రంలో చేపల వేట చేసే బోటును కొనుగోలు చేశారు. ఆ బోటును తీసుకుని చెన్నై నుంచి సముద్ర తీరానే శ్రీహరికోట మీదుగా కావలికి వెళుతున్నాడు. సరిగ్గా షార్ వద్దకు వచ్చేసరిగా బోటులో మోటారు మొరాయించింది. చేసేదేమి బోటును సముద్రం ఒడ్డుకు తీసుకొచ్చాడు. సమీపంలో విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది అనుమానంతో బోటు యజమాని శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నట్లు తేలింది. జువ్వలదిన్నెవాసిగా తేలడంతో, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి పూర్తి వివరాలు తెలుసుకున్నాక బోటు యజమానిని పంపించేశారు.

నాలుగు సచివాలయాలకు ఒక్కరే!

ఉద్యానవన సహాయకుల కొరత ● గత ఏడాది క్రాప్ బుకింగ్ సరిగా చేయలేదని సిబ్బంది కుదింపు ● రైతుల ఇబ్బందులు

లింగసముద్రం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యాలపాడు క్లస్టరు పరిధిలోని ముత్యాలపాడు, పెదపవని, చినపవని, అన్నెబోయినపల్లి గ్రామ సచివాలయాలకు ఒక్కరే గ్రామ ఉద్యానవన సహాయకులు (విహెచ్‌ఏ) ఉండడం తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ నాలుగు సచివాలయాలకు నలుగు రు గ్రామ వ్యవసాయ సహాయకులు ఉండేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలను క్లస్టర్ పద్ధతిలో విభజించి, ఈ నాలుగు సచివాలయాల ను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. పెదపవని సచివాలయానికి ఒక్కరినే ఉద్యానవన సహాయకు డిగా నియమించారు. దీంతో ఆయన అటు వ్యవ సాయానికి సంబంధించిన సేవలతో పాటు ఉద్యా నవన పంటలు సాగు చేసే రైతులకు సేవలు అందించాల్సి ఉంది. ఈ కారణంగా పెదపవని సచివాలయంతో పాటు మిగిలిన మూడు సచివాల యాల పరిధిలోని రైతులకు సేవలు అందించాలి. అంతేగాక ప్రభుత్వం రైతులకు అందించే పథకాల ను కూడా రైతులకు అందేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అంతేగాక ఈ పంట నమోదు, పంటల బీమా తదితర పనులు కూడా చేయాల్సి ఉంది. అన్నదాత-సుఖీభవ,



పీఎం కిసాన్ మొదలైన పథకాలకు సం బంధించి రైతులకు సేవలు అందించాల్సి ఉంది. ఒక్కరే అన్ని సచివాలయాలకు విధులు నిర్వహించాల్సి రావడంతో ఆయన రైతులకు అందుబాటులో ఉండలేక పోతున్నారు. ప్రస్తుతం అన్నదాత సుఖీ భవ, పీఎం కిసాన్ నిధులు రాని రైతులు ఉద్యానవ న సహాయకుడు ఏ సచివాలయంలో ఉంటారో తెలియక సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నారు. దీంతో ఈ నాలుగు రైతు సేవా కేంద్రాలలో మూడు రైతు సేవా కేంద్రాల తలుపులు ఎప్పుడూ తెరుచుకోవు. అయితే ఆయన వచ్చిన రోజు మాత్రం తెరుచుకుంటాయి. అయితే గత ఏడాది ఈ నాలు గు సచివాలయాల పరిధిలో వీఏఏల కొరత కార ణంగా రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ లో సరిగా నమోదు చేయలేదు. దీంతో ఆన్‌లైన్‌లో ఈ-పంట నమోదు చేసిన భూములు తక్కువగా ఉండడంతో రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు రెండు పోస్టులను తొలగించినట్టు తెలిసింది. దీంతో రైతులకు అందాల్సిన సేవలు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వీఏఏలను నియమించాలని వారు కోరుతున్నారు.

కల్వర్టుపై రంధ్రం పూడ్చివేత



కావలి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పాతూరులోని అక్కమ్మ బావిసెంటర్ సమీపంలో పంటకాలువ వద్ద నాలుగు రోడ్ల కూడలిలో కల్వర్ట్‌పై పడిన పెద్ద రంధ్రాన్ని మున్సిపల్ అధికారులు పూడ్చారు. కల్వర్ట్‌పై రంధ్రం - పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు ఆ రంధ్రాన్ని కాంక్రీట్‌తో పూడ్చి అక్కడ ప్రమాదాలు జరుగకుండా మరలా రంధ్రం పడకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తోట వెంకటేశ్వర్లుకు సేవారత్న పురస్కారం



పురస్కారమందుకుంటున్న తోట వెంకటేశ్వర్లు

కావలి(టౌన్) ఆగస్టు17(ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక కావలి అధ్యక్షుడు, టీవీఎస్ ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు చంద్రన్న సేవారత్న పురస్కారం అందుకున్నారు. ఆయన వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నందుకు గాను ఆదివారం నెల్లూరు టౌన్ హాల్‌లో ధర్మచక్ర సినిమా దర్శక నిర్మాతైన టి వెంకటరమణ సేవారత్న పురస్కారంతో సత్కరించారు. తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి సేవారత్న పురస్కారమందించడం సంతోషంగా ఉందన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణంతో

ఆర్టీసీ బస్సులు కిటకిట



కావలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం లో భాగంగా ఆర్టీసీ బస్సు లలో మహిళలకు ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో మహిళలతో బస్సులు కిటకిటలాడుతు న్నాయి. సహజంగా ఆదివారం గ్రామీణ బస్సులలో పెద్దగా రద్దీ ఉండదు. అయితే ఉచిత ప్రయాణం కావటంతో ఆదివారం కూడా కావలి ఆర్టీసీ డిపోలో సింగరాయకొండ వైపు వెళుతున్న పల్లెవెలుగు బస్సులో ఎక్కేందుకు మహిళలు తొక్కిసలాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చిన్నారులకు నిత్యావసరాల వితరణ

కావలి(టౌన్)ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ సంరక్షణలోని చిన్నారులకు నెలకు సరిపడా నిత్యావసరాలు వితరణ చేశారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, రత్నమ్మ ఫౌండేషన్ చైర్మన్ ప్రసాదరావులు పాల్గొని నిత్యావసరాలు, పోస్ట్ ఆఫీస్‌లో ప్రతినెలా జమ చేస్తున్న పాస్ పుస్తకాలు అందించారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ అనాథ, నిరాదరణ పిల్లలను దాతలు దత్తత తీసుకుని సంయుక్త సంస్థ సంరక్షణలో వారిని ఉంచి ప్రతినెలా వారికి అవసరమైన నిత్యావసరాలు పిల్లల భవిష్యత్ అవసరాలకు ప్రతినెలా వారి పేరిట పోస్ట్ ఆఫీస్‌లో రూ.1000 జమ చేస్తున్నారని దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జలవిద్యుత్ తయారీ ప్రక్రియ అద్భుతం

కందుకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులు క్షేత్ర పరిశీలనలో భాగంగా శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి తీరును పరిశీలించారు. కళాశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులు తమ అనుభవాలను సహచర విద్యార్థులు, అధ్యాపకులతో పంచుకున్నారు. శ్రీశైలం హైడల్ ప్లాంట్ డీఈఈ చంద్రశేఖర్ విద్యుత్ ప్రక్రియను, అక్కడి యంత్రపరికరాల పనితీరును తమకు వివ రించారని తెలిపారు. కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ మా ట్లాడుతూ థియరీతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందిస్తేనే విద్యా ర్థులు లక్ష్యసాధనలో విజయవంతమ వుతారని, అందుకే క్షేత్రప ర్యటనలకు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు, అకడమిక్ ఇన్‌ఛార్జి ఎస్ఎన్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై దాడులు అమానుషం'

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో దళితులపై దాడి చేయడం అమానుషమని ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు జ్యోతి సోముశేఖర్ వరప్రసాద్ అన్నారు. బోగోలు బజారు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితుల ఆత్మ గౌరవ సమావేశం ఆదివారం నిర్వహించారు. దళిత నేతలు దాసరి బాబురావు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కొప్పోలు రఘు, అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, జువిగుంట బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

బోగోలులో చిరుజల్లులు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి చిరు జల్లులు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు వచ్చాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి తెలిపారు.

సుందర సమాజ స్థాపనపై చర్చాగోష్ఠి



ముసునూరు బిలాల్ మసీదులో సమావేశమైన వివిధ మతస్థులు

కావలి(టౌన్)ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం ముసునూరులోని ముస్లింపాలెంలోని బిలాల్ మసీదులో సుందర సమాజ స్థాపనపై చర్చాగోష్ఠి కార్యక్రమం జరిగింది. జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు సయ్యద్ జిలాని బాషా పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వివిధ మతాలకు చెందిన చెన్నా వెంకట రమణయ్య, శారద, లలితా, సుకన్య, ఏసుపా దం, రవి, సాయి, దేవ తదితరులు పాల్గొని సుందర సమాజ స్థాపన గురించి మాట్లాడారు. తల్లితండ్రులు పిల్లలను బాధ్యతగా పెంచాలని, విద్యాసంస్థల్లో నైతిక విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. జమాతే ముస్లీం హింద్ స భ్యులు మొహమ్మద్ ముస్లీం, చాంద్‌బాష, ఆబిద్, మహబూబ్‌బాష, నూర్జహాన్, ఫాతిమ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న రెహనాబేగం

ఉదయగిరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్క రించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ రెహనాబేగం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అంగ న్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు మాట తప్పారని అధికారం చేపట్టి ఏడాది దాటినా ఇంతవరకు సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఇచ్చిన ఫోన్‌లు పనిచేయక కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందులో భాగంగా ఈనెల 4న జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు తమ ఫోన్‌లను సీడీపీవో కార్యాలయాలకు అప్పగించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పదోన్నతులు కల్పించడంతోపాటు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 5జీ ఫోన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, రజియా, నాయబ్, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో మెట్ట పైర్లకు మేలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మెట్ట పంటలకు వర్షం సానుకూలంగా మారుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోతకు వచ్చిన వేరుశనగ రైతులు మాత్రం పంట నష్టపోవాల్సి వస్తుందేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో రహదారులు, నివాసాల సముదాయాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

నేడు వేంకటేశ్వరుడి కల్యాణం

మర్రిపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శాంతికుమారి దంపతుల ఆధ్వర్యంలో వారి నివాస ప్రాంగణంలో సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కల్యాణానికి ఆత్మకూరు, ఉదయగిరి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతన మంజూరు పత్రాల పంపిణీ



విద్యార్థికి ఉపకార వేతన మంజూరు పత్రం అందజేస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చదువుకునే రోజుల్లో తనకు అందిన ఆర్థిక చేయూత వల్లే తాను ఈస్థాయికి ఎదిగానని విశ్రాంత ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీడ్స్ స్వచ్ఛంద సంస్థలో జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెంది 10వ తరగతిలో ప్రతిభ చాటి ఆర్థికంగా వెనుకబడిన 96 మంది విద్యార్థులకు సీడ్స్ యువ ఆన్‌స్టాపబుల్ సంస్థలు సంయుక్తంగా ఉపకార వేతనాల మంజూరు పత్రాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యలో రాణిస్తూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ ఉపకార వేతనాలు అంజేస్తున్నామన్నారు. అందులో భాగంగానే సీడ్స్ స్వచ్ఛంద సంస్థ స్థాపించి వివిధ వర్గాల వారికి సేవలం దిస్తున్నామన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సబితారెడ్డి, రైతు సాధికార సంస్థ రీజనల్ టెక్నికల్ కోఆర్డినేటర్ రవిచంద్ర, విశ్రాంత శాస్త్రవేత్త రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈవో వెంగయ్య, విశ్రాంత ఎంపీడీవో జహీర్, సీడ్స్ సంస్థ సీఈవో పురుషోత్తం, సిబ్బంది వేణుగోపాల్, రసూల్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు లేక నీటివనరులు వెలవెల

● ఆందోళనలో అన్నదాతలు

ఉదయగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు లేక నీటి వనరులు వెలవెల బోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో సుమారు 250 చెరువులు ఉండగా వాటి కింద 45 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. అలాగే గండిపాళెం, మర్రివూట్ల, నక్కలగండి రిజర్వాయర్ల కింద 22వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆశాజనకంగా వర్షాలు కురవకపోవడంతో నీటి వనరులన్నీ నీరులేక వెలవెలబోతున్నాయి. జలాశయాల్లో నీటిమట్టం డెడ్‌స్టోరేజీలో ఉంది. దీంతో చెరువు, జలాశయాల ఆయకట్టు భూములు కొన్ని ప్రాంతాల్లో చిట్టడవిని తలపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో బోర్ల కింద రైతులు అరకొరగా వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు సాగు చేసి ఉన్నారు. అరకొరగా కురుస్తున్న చిరుజల్లులకు ప్రస్తుతం పంటలు పచ్చగా ఉన్నా చేతికందుతాయో లేదోనన్న ఆందోళన కర్షకుల్లో నెలకొంది. వరుణుడు కరుణించి నీటి వన రులకు పుష్కలంగా నీరు చేరితే పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంది.



డెడ్‌స్టోరేజీలో ఉన్న గండిపాళెం జలాశయం నీటిమట్టం

చిరుజల్లులకే పరిమితం

రాష్ట్రంలో ఎక్కడ చూసినా విస్తారంగా వర్షాలు కురుస్తూ నీటి వనరులు జలకళతో కళకళ లాడుతున్నాయి. అయితే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంపై మాత్రం వరుణుడు కరుణ చూపడంలేదు. గత పక్షం రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నా చిరుజల్లులకే పరిమితమవుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 80 రోజులు కావస్తున్నా సరైన వర్షపాతం నమోదు కాలేదు. దీంతో బంగారం పండే భూములు బీళ్లుగా ఉన్నాయి. అరకొరగా బోర్ల కింద సాగుచేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా వర్షాధారంపై ఆధారపడిన ప్రాంతాల్లో నిరాశజనకంగా కనిపిస్తోంది. ఆశించిన మేర వర్షాలు కురవక జలాశయాలు, చెరువులు, నీటికుంటలు చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్ కలిసొచ్చేలా లేదని పలువురు రైతులు అంటున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఉదయగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీకి చెందిన యాసారపు దేవయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం ఆదివారం తన ప్రతినిధులచే ఆ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. దేవయ్య కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థికంగా ఆదుకునేలా చర్యలు చేపడతామని వారు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఇమ్రాన్, భాస్కర్, సునీల్, నవీన్ పాల్గొన్నారు.

పందుల స్వైర విహారంతో గ్రామస్థుల బెంబేలు

ఏఎస్ పేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యాత్రస్థలంగా దేశవ్యాప్తంగా పేరుపొందిన ఏఎస్‌పేటలో పందుల స్వైర విహారంతో గ్రామస్థులు, యాత్రికులు బెంబేలెత్తుతున్నారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు గ్రామంలో తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారు. పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఒక్కసారిగా జనాల మధ్యలోకి దుసుకురావడంతో భయాందోళనకు గురవుతున్నారు. పలువురిపై దాడి చేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులను గ్రామం నుంచి తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధ్వానంగా జలాశయ కాలువలు



అధ్వానంగా మారిన పంట కాలువ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూతవేటు దూరంలో జలాశయం ఉన్నా సాగునీరు మాత్రం అందని ద్రాక్షగానే ఊరిస్తోంది. ఏళ్లతరబడి ఇలాంటి తంతే కొనసాగుతుండడంతో ఉదయగిరి, వరికుంటపాడు మండలాల రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ జలాశయం పరిధిలో మొత్తం 16వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందడం కలగానే మిగులుతోంది. ప్రధాన కాలువలతో పాటు లింకు కాలువలు సైతం అధ్వాన్నంగా మారడంతో సాగునీరు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోతోంది. రాళ్లు, రప్పలతో పూడి పోవడంతో సహా కంపచెట్లు మొలవడంతో ఈ పరిస్థితి దాపురించింది. దీంతో పలు గ్రామాల చెరువులకు కూడా నీరందే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రహదారిపై మురుగుతో పాదచారుల అవస్థలు



రహదారిపై పారుతున్న మురుగునీరు

ఉదయగిరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో మురుగు కాలువ పూడికతో నిండి రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువ వెడల్పు తక్కువగా ఉండడం, చెత్తాచెదారం అడ్డుపడడంతో రహదారిపైనే మురుగు ప్రవహిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు రోడ్డుపైనే చెత్తాచెదారం చేరడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో పూడిక తీసి మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో శ్రావణ మాసం నాల్గవ ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో మధ్యా హ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు కుంకుమార్చన



గంగమ్మ కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

సంగం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న పాలేటి గంగమ్మ ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా గంగమ్మకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహిళలు కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.